www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

సంపుటి - 3 సంచిక -362 గురువారం 9 ఏప్రిల్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

# లెబనాన్‌పై ఇజ్రాయిల్ విధ్వంసకాండ

## కాల్పుల విరమణ ఉల్లంఘన

**సీజ్‌ఫైర్ ప్రకటించిన కొద్దిసేపటికే**

**లెబనాన్‌పై ఇజ్రాయిల్ విధ్వంసకాండ**

**వందలసంఖ్యలో మృతులు**

**సీరియస్‌గా తీసుకున్న ఇరాన్**

**హార్ముజ్ జలసంధి మళ్లీ మూసివేత**

**కాల్పుల విరమణపై అనిశ్చితి**

**ఏప్రిల్ 8 (ప్రజావినికిడి):** పశ్చిమాసియాలో అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన తాత్కాలిక సీజ్‌ఫైర్‌పై మళ్లీ అనిశ్చితి నెలకొంది. రెండు వారాల పాటు యుద్ధ విరమణకు ఇరుదేశాలు అంగీకరించినప్పటికీ, పరిస్థితులు మళ్లీ మొదటికి వచ్చినట్టు తెలుస్తోంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. **మిగతా 2లో...**



# అన్నదాతకు అండ

## రూ.41,533.81 కోట్లు కేటాయింపు

**కేంద్ర కేబినేట్ కీలక నిర్ణయాలు**

**ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీ**

**జైపూర్ మెట్రో ఫేజ్-2కు ఆమోదం**

**న్యూఢిల్లీ ఏప్రిల్ 8 (ప్రజావినికిడి):** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారంనాడు జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో 5 కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఖరీఫ్ సీజన్ కోసం న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీగా రూ.41,533.81 కోట్లు కేటాయించారు. ఇది 2025 ఖరీఫ్ సీజన్‌లో బడ్జెటరీ కేటాయింపుల కంటే రూ.4,313 కోట్ల రూపాయలు అధికం. 2025 ఖరీఫ్ బ్జడెట్ రూ.37,216.15 కోట్లుగా ఉంది. కాగా, జైపూర్ **మిగతా 2లో...**



# సిఎం రేవంత్‌తో ఘనా హైకమిషనర్ భేటీ

**సిఎంతో భేటీ అయిన టాటా ఏరో స్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్**



**హైదరాబాద్, ఏప్రిల్ 8 (జర్నలిస్ట్ వార్త):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఘనా హైకమిషనర్ క్వాసి ఒబిరి-డాన్సో మర్యాదపూర్వకంగా కలిసిన రిపబ్లిక్ ఆఫ్ ఘనా హైకమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా హైదరాబాద్ కు వచ్చిన క్వాసి ఒబిరి-డాన్ సిఎంను ఆయన నివాసంలో కలుసుకున్నారు. ఘనా, తెలంగాణ మధ్య సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించిన హైకమిషనర్. విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలు, ఆరోగ్య, వాణిజ్య రంగాల్లో పరస్పర సహకారం ఉండాలని కోరిన హైకమిషనర్. ానుకూలంగా స్పందించిన సీఎం ఆయనకు శాలువాతో సన్మానించారు. **మిగతా 2లో...**

# సీఎస్ఆర్ నిధుల్ని స్థానికంగానే వినియోగించండి

**ఏ రంగంలో ఖర్చు చేయాలో మీరే నిర్ణయించుకోండి**

**సమన్వయం కోసం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నియామకం**

**కంపెనీల ప్రతినిధులతో సీఎం సమీక్ష**

**హైదరాబాద్ ఏప్రిల్ 8 (ప్రజావినికిడి):** కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల వినియోగంపై ఇప్పటి వరకు రాష్ట్రంలో సంపూర్ణ విధానమే లేదని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి తెలిపారు. అందువల్లే కంపెనీలను సమన్వయం చేసుకొనేందుకు ప్రభుత్వం తరఫున ప్రత్యేక ప్రధాన**మిగతా 2లో...**






# యధాతథంగా కీలక వడ్డీరేట్లు

## ఆర్‌బిఐ గవర్నర్ మల్హోత్రా

**ముంబై, ఏప్రిల్ 8 (ప్రజావినికిడి):** కీలక వడ్డీ రేట్లను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరుసగా రెండోసారి కూడా యధాతథంగా ఉంచింది. ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తాజాగా వెల్లడించారు. ఈసారి కూడా రెపో రెటులో **మిగతా 2లో...**



# కేరళం, అస్సాం, పుదుచ్చేరిల్లో నేడు పోలింగ్

**న్యూఢిల్లీ : ఏప్రిల్ 8 (ప్రజావినికిడి):** ఐదు అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా కేరళం, అస్సాం, పుదుచ్చేరిల్లో గురువారం పోలింగ్ జరగనుంది. ఇందుకోసం ఎలక్షన్ కమిషన్ అన్ని ఏర్పాట్లు చేసింది. కేరళంలో మొత్తం 140 స్థానాలకు ఎన్నికలను ఒకే దశలో నిర్వహిస్తున్నారు. ఇక్కడ మొత్తం 883 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. **మిగతా 2లో...**

# పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై తీర్పు 22కు వాయిదా

**'కాళేశ్వరం' పనుల్లో అవకతవకలపై విచారణకు ఏర్పాటు**



**హైదరాబాద్ ఏప్రిల్ 8 (ప్రజావినికిడి):** కాళేశ్వరం ప్రాజెక్ట్ పనుల్లో అవకతవకలపై విచారణకు ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై హైకోర్ట్ తీర్పును ఈ నెల 22కు వాయిదా వేసింది. చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ బుధవారం కేసును విచారించింది. మార్చి 12న దీనిపై వాదనలు పూర్తవ్వగా కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. తీర్పు కాపీ సిద్ధం కాకపోవడంతో వాయిదా వేస్తున్నట్టు పేర్కొంది. కమిషన్ నివేదికను సవాలు చేస్తూ బీఆర్ఎస్ అధినేత, కేసీఆర్, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు,**మిగతా 2లో...**

# మంత్రులపై బురదజల్లడమే బిఆర్ఎస్ పని

**వారికున్న బురదను మాకు అంటించాలని యత్నం**

**నాదర్ గుల్, వట్టినాగులపల్లి భూములపై నిందలు**

**హరీష్‌కు వాటా దక్కక పోవడంతో ఇప్పుడు విమర్శలా**

**మండిపడ్డ మంత్రి పొంగులేటి**

హైదరాబాద్, **ఏప్రిల్ 8 (ప్రజావినికిడి):** నాదర్‌గుల్ భూముల విషయంలో భారత రాష్ట్ర సమితి నేత హరీశ్ రావు దుష్ప్రచారం చేస్తున్నారని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.,**మిగతా 2,3లో...**



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# కాల్పుల విరమణ ఉల్లంఘన

మొదటిపేజీ తరువాయి

తాజాగా బుధవారం లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులు తీవ్రతరం చేసింది. భారీ వైమానిక దాడులతో జనావాసాలపై విరుచుపడింది. వందల సంఖ్యలో ప్రాణనష్టం సంభవించింది. క్షతగాత్రులను తరలించటానికి ఆస్పత్రులు కూడా సరిపోవటంలేదని వైద్యవర్గాలు తెలిపాయి. ఈ దుశ్చర్యను సీరియస్‌గా తీసుకున్న ఇరాన్ హార్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్టు ప్రకటించింది. ఐతే పాకిస్తాన్‌లో జరగనున్న చర్చలకు అమెరికా తరఫున ఆ దేశ ఉపాధ్యక్షుడు జెడీ వాన్స్ హాజరవుతారని వైట్‌హౌస్ ప్రకటించింది.లెబనాన్‌లో హిజ్బుల్లాతో పాటు అమాయక ప్రజలపై ఇజ్రాయిల్ చేస్తున్న విధ్వంసకాండపై ఇరాన్‌ను తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించిన సీజ్‌ఫైర్ ఒప్పందం మంగళవారం నుంచి ప్రారంభమైనప్పటికీ, అది అన్ని ప్రాంతాలకు వర్తించదని ఇజ్రాయిల్ స్పష్టం చేసింది.ఈ ఒప్పందంలో లెబనాన్ భాగం కాదని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు పేర్కొన్నారు. ఈ ప్రకటన చేసిన స్వల్ప వ్యవధిలోనే ఇజ్రాయిల్ దళాలు లెబనాన్‌పై భారీ విధ్వంసకాండకు తెగబడ్డాయి.దీంతో ఇరాన్ కూడా హార్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్టు ప్రకటించింది. ఓవైపు సీజ్‌ఫైర్ అంటున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నెతన్యాహును కట్టడి చేయటంలో విఫలమయ్యారు. దీంతో యుద్ధ పరిస్థితులు మళ్లీ మొదటికే వస్తున్నట్టు తెలుస్తోంది. గతంలో పీస్ ఆఫ్ బోర్డు ఏర్పాటు చేశాక కూడా నెతన్యాహు గాజాపై విరుచుకుపడుతున్న విషయం విదితమే. అదే తరహాలో లెబనాన్‌పై కూడా విధ్వంసానికి తెగబడుతున్నారు. ఈ చర్యలు మరోవైపు పాకిస్తాన్‌లో జరగనున్న చర్చలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. తాత్కాలిక ఉపశమనం పొందిన మధ్యప్రాచ్యం మళ్లీ నెత్తుటేరుల వైపు పయనిస్తుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

### మధ్యప్రాచ్యంలో సువర్ణాధ్యాయం : ట్రంప్

ఇదిలావుండగా కాల్పుల విరమణపై ట్రంప్ ఓ ప్రకటన చేశారు. 'ఇరాన్‌ను ధ్వంసం చేసేందుకు దళాలను పంపాలని గతంలో తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నాను. అయితే హార్మూజ్ జలసంధిని ఇరాన్ పూర్తిగా, తక్షణమే స్వయంగా తెరిచినప్పుడే మా దాడులు ఆగిపోతాయి. ఇది ప్రపంచ శాంతికి గొప్ప రోజు. హార్మూజ్‌ను తెరిచేందుకు ఇరాన్ అంగీకరించింది. ఆ జలసంధిలో నౌకల రవాణాను సులభతరం చేయడానికి అమెరికా సాయపడుతుంది. యుద్ధం ఆగిపోవాలని యావత్ ప్రపంచం కోరుకుంది. కాల్పుల విరమణ కోసం పెట్టిన రెండు వారాల గడువు ఇరాన్‌తో శాశ్వత ఒప్పందానికి, పశ్చిమాసియాలో శాంతి స్థాపనకు ఎంతగానో ఉపకరిస్తుంది. ఆ ప్రాంతంలో ఇక సువర్ణాధ్యాయం ప్రారంభం కాబోతోంది.

సానుకూల చర్యలతో వాణిజ్య పరంగా ముందడుగు వేయడానికి ఇరాన్‌కు ఇది మంచి అవకాశం. ఇరాన్ తన పునర్నిర్మాణ పనులను మొదలు పెట్టవచ్చు. ఈ విషయంలో మేము తప్పకుండా సాయం చేస్తాం. అమెరికా లాగానే ఇరాన్‌కూ మంచి రోజులు రాబోతున్నాయి' అని ట్రంప్ వివరించారు. కాల్పుల విరమణకు ఇరాన్‌ను అంగీకరింపజేయడంలో చైనా పాత్ర ఏమైనా ఉన్నదా అని పాత్రికేయులు ప్రశ్నించగా 'ఆ విషయాన్ని నేనూ విన్నాను. చైనా ప్రమేయం ఉండవచ్చునని అనుకుంటున్నాను' అని చెప్పారు. వచ్చే నెలలో ట్రంప్ చైనాలో పర్యటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. కాగా ట్రంప్, శక్తివంతమైన అమెరికా సైన్యం కారణంగానే హార్మూజ్‌ను తిరిగి తెరిచేందుకు ఇరాన్ అంగీకరించిందని అమెరికా చెప్పుకుంటోంది.

### ఒప్పందానికి ఓకే కానీ..: ఇజ్రాయిల్

రెండు వారాల పాటు కాల్పులకు స్వస్తి చెప్పేందుకు ఇజ్రాయిల్ కూడా అంగీకరించింది. అయితే ఈ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదని తేల్చి చెప్పింది. హెజ్బొల్లాలను లక్ష్యంగా చేసుకొని ఇజ్రాయిల్ తాజాగా దక్షిణ లెబనాన్‌పై దాడులు చేసింది. ఇరాన్ ప్రతిపాదించిన పది సూత్రాలలో లెబనాన్‌పై దాడుల నిలిపివేత అంశం కూడా ఉంది. అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన ఒప్పందంపై ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెత న్యాహూ కార్యాలయం స్పందిస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. 'ట్రంప్ నిర్ణయానికి మద్దతు ఇస్తున్నాం. ఇరాన్ నుంచి ప్రపం చానికి ప్రమాదం ఏర్పడకుండా అమెరికా చేస్తున్న ప్రయత్నాలను సమర్థిస్తున్నాం. ఇరాన్‌తో చర్చలు జరగబోతున్నాయి. ఆ చర్చల సందర్భంగా అమెరికా, ఇజ్రాయిల్, వాటి మిత్ర దేశాల లక్ష్యాలను సాధించేందుకు కట్టుబడి ఉంటానని అగ్రరాజ్యం హామీ ఇచ్చింది. ఈ కాల్పుల విరమణ ఒప్పందం లెబనాన్‌కు వర్తించదు' అని ఆ ప్రకటన తెలియజేసింది.

### ఆగని దాడులు

కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రకటించినప్పటికీ గల్ఫ్‌లోని సౌదీ అరేబియా, బహ్రెయిన్, కువైట్‌లలో క్షిపణి అలర్ట్ జారీ చేశారు. ఇరాన్ ప్రయోగించిన క్షిపణులను అడ్డుకున్నామని ఆయా దేశాలు తెలియజేశాయి. లావన్ దీవిలో ఉన్న చమురు రిఫైనరీపై బుధవారం ఉదయం 10 గంటలకు దాడి జరిగిందని ఇరాన్ తెలిపింది. అయితే ఈ దాడిలో ఎవరూ గాయపడలేదు.

### నౌకలపై రవాణా పన్ను

హార్మూజ్ జలసంధి మీదుగా ప్రయాణించే నౌకలపై ఇరాన్, ఒమన్ దేశాలు రవాణా పన్ను విధిస్తాయి. అమెరికా-ఇరాన్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలో ఈ నిబంధనను చేర్చారు. 34కిలోమీటర్ల వెడల్పున్న హార్మూజ్ జలసంధి ఒమన్, ఇరాన్ ప్రాదేశిక జలాల పరిధిలో ఉంది. దీనిని అంతర్జాతీయ జలమార్గంగా పరిగణిస్తారు. ఇప్పటి వరకూ ఈ మార్గంలో నౌకాయానంపై ఏ దేశమూ టోల్ విధించలేదు. రవాణా పన్ను వసూలు ద్వారా సమకూరే సొమ్మును యుద్ధానంతర ఇరాన్ పునర్నిర్మాణానికి వినియోగిస్తామని అధికారులు తెలిపారు. అమెరికా-ఇజ్రాయిల్ యుద్ధం కారణంగా ఇరాన్ రక్షణ, పరిపాలన, పౌర మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టం వాటిల్లిన విషయం తెలిసిందే. నౌక రకాన్ని బట్టి పన్నును నిర్ణయిస్తారని రాయిటర్స్ వార్తా సంస్థ తెలిపింది. అయితే చమురు రవాణా నౌకలపై పన్ను విధించడాన్ని యూఏఈ, ఖతార్ సహా గల్ఫ్ దేశాలు వ్యతిరేకిస్తున్నాయి.

#### యుద్ధం ముగిసిపోలేదు..మా వేళ్లు ట్రిగ్గర్ పైనే : మొజ్తాబా

కాల్పుల విరమణపై ఒప్పందం కుదిరిన నేపథ్యంలో దాడులను ఆపేయాలని ఇరాన్ సుప్రీం నేత అయతొల్లా మొజ్తాబా ఖమేనీ తన దళాలకు ఆదేశాలు జారీ చేశారు. అయితే యుద్ధం పూర్తిగా ముగిసిపోలేదని, కాబట్టి అందరూ అప్రమత్తం గా ఉండాలని సూచించారు. మొజ్తాబా ప్రకటనను ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్‌లో చదివి వినిపించారు. 'సుప్రీం నేత ఆదేశా లను అన్ని సైనిక విభాగాలు పాటించాయి. దాడులు నిలిపివే శాయి. కాల్పు ల విరమణ అంటే యుద్ధం ఆగిపోయినట్టు కాదు. మా వేళ్లు ఇంకా ట్రిగ్గర్ పైనే ఉన్నాయి.శత్రువులు మళ్లీ దురాక్ర మణకు పాల్పడితే తగిన విధంగా బదులిస్తాం' అని ఇరాన్ టీవీ తెలిపింది. కాగా తాను సూచించిన పదిహేను సూత్రాల ప్రతిపాదనపై చర్చించాలంటూ అమెరికా చేసిన అభ్యర్థనను పరిశీలించేందుకు ఇరాన్ అంగీకరించింది. సాంకేతిక పరిమితుల పరిశీలన, ఇరాన్ సాయుధ దళాలతో సమన్వయం ద్వారా హార్మూజ్‌లో నౌకలు సురక్షితంగా ప్రయాణించడం సాధ్యమేనని తెలిపింది. ఈ ఒప్పందం టెహ్రాన్ విజయమేనని చెప్పింది.

# సీఎస్ఆర్ నిధుల్ని స్థానికంగానే వినియోగించండి

మొదటిపేజీ తరువాయి

కార్యదర్శిని నియమించామన్నారు. ఎక్కడి సంస్థలు ఆ ప్రాంతాల్లోనే సీఎస్ఆర్ నిధుల్ని ఖర్చు చేస్తే ఫలితాలు మెరుగ్గా ఉంటాయని తెలిపారు. దీనికి సంబంధించిన ప్రాధాన్య రంగాలను వారే ఎంచుకోవాలని చెప్పారు. దీనికోసం ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సీఎస్ఆర్ నిధులను ఖర్చుగా కాకుండా, అభివృద్ధిలో భాగస్వామ్యంగా చూడాలని కోరారు. సీఎస్ఆర్ నిధులకు సంబంధించి వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి బుధవారం సమావేశమయ్యారు.సీఎస్ఆర్ నిధుల ద్వారా ప్రభుత్వ శాఖల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్ని సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య రంగాలను కంపెనీల ప్రతినిధులకు వివరించారు. విద్య, వైద్యం, జల వనరుల సంరక్షణ, నైపుణ్య శిక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. వీటితో పాటు కంపెనీలు తమకు ఇష్టమైన ఏ రంగాన్నైనా ఎంచుకొని సీఎస్ఆర్ నిధులు వినియోగించాలని కోరారు. ప్రభుత్వంతో పాటు కంపెనీలు సీఎస్ఆర్ నిధుల ద్వారా చేసే ఖర్చుల వల్ల రాష్ట్రంలోని విద్యార్థులు ప్రపంచ స్థాయి నైపుణ్యంగలవారిగా తీర్చిదిద్దబడతారని తెలిపారు. విద్యపై పెట్టే వ్యయాన్ని తాము భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామన్నారు.

రాష్ట్రంలోని విద్యార్థుల సంఖ్యలో హైదరాబాద్ నగరంలోనే 44 శాతం ఉన్నారనీ, వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కంపెనీలు స్థానికంగా ఉన్న అన్ని మౌలిక వసతులను వినియోగించుకుంటున్నందున తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించాలన్నారు. ఇప్పటికే రహేజా గ్రూప్ రూ.50 కోట్లు, రాంకీ గ్రూప్ రూ.50 కోట్లు, యశోద ఫౌండేషన్ రూ.10 కోట్లు విద్యాభివృద్ధికి కేటాయించేందుకు ముందుకు వచ్చాయంటూ వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కంపెనీల ప్రతినిధులు స్పందిస్తూ సీఎస్ఆర్ నిధుల విషయంలో ఇప్పటి వరకు ఇలా ఎవరూ తమను సంప్రదించలేదని తెలిపారు. ఈ విషయంలో చొరవ తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. పాఠశాల విద్యా, ఆస్పత్రులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు వారు ఆసక్తి చూపారు. సమావేశంలో శ్రావణ్‌కుమార్ (రహేజా ఫౌండేషన్), దాక్షయణి ఆళ్ల (రాంకీ ఫౌండేషన్), డాక్టర్ గోరుకంటి సురేందర్‌రావు, గోరుకంటి ఫల్గుణ్ రావు (యశోద ఆస్పత్రి), సుధారెడ్డి (మేఘా), అపర్ణారెడి (అపోలో ఆస్పత్రి), కామినేని భాస్కర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి (ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్), పగిడిపాటి దేవయ్య, రుద్రమదేవి (నాదం ఫౌండేషన్), ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేశ్ ధోత్రే, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

# పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై తీర్పు 22కు వాయిదా

ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్, మాజీ ఐఏఎస్ అధికారి ఎస్.కె. జోషిలు వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు.కమిషన్ తమకు సముచిత అవకాశం ఇవ్వకుండా ఏకపక్షంగా నివేదిక సమర్పించిందని వారు ఆరోపిస్తున్నారు. రాజకీయ కక్షలో భాగంగానే కమిషన్‌ను వేశారని పిటిషనర్లు వాదిస్తుండగా, ప్రజా ప్రయోజనాలు కాపాడేందుకే కాళేశ్వరంపై కమిషన్ వేశామని ప్రభుత్వం తెలిపింది. వాదనల సమయంలో కేసీఆర్ తరపు అడ్వకేట్.. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ నిబంధనలను ఉల్లంఘించారని కోర్టుకు తెలిపారు. 8(బీ), 8(సీ) నోటీసులు ఇవ్వలేదనీ, ఎక్కడా విట్నెస్‌తో క్రాస్ ఎగ్జామినేషన్ జరగలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అక్రమాలు జరిగాయని ఎలాంటి ఎంక్వైరీ లేకుండానే ప్రభుత్వం ఒక నిర్ణయానికి రావడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.

# యధాతథంగా కీలక వడ్డీరేట్లు

మొదటిపేజీ తరువాయి

ఎలాంటి మార్పూ లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నామని ప్రకటించారు. దేశ ఆర్థిక వృద్ధిపై ఆశావహ అంచనాలు వెల్లడించిన ఆర్బీఐ గవర్నర్, అంతర్జాతీయ పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్బీఐ రెపో రేట్లను ఆర్బీఐ యధాతథంగా ఉంచడం వరుసగా ఇది రెండోసారి. గత ఫిబ్రవరిలో జరిగిన సమీక్షలో కూడా వడ్డీ రేట్లలో ఆర్బీఐ ఎలాంటి మార్పులూ చేయలేదు. కాగా, అంతర్జాతీయ పరిస్థితులపై ఆర్బీఐ గవర్నర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పలు సవాళ్లు ఎదురవుతున్నాయని, వృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 6.9 శాతంగా నమోదు కావొచ్చని అంచనా వేశారు

ప్రపంచవ్యాప్తంగా చమురు ధరల్లో పెరుగుదల ద్రవ్యోల్బణంపై ప్రభావం చూపించవచ్చని ఆర్బీఐ గవర్నర్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రిటైల్ ద్రవ్యోల్బణం 4.6 శాతంగా ఉండొచ్చన్నారు. అలాగే ఏప్రిల్ 3వ తేదీ నాటికి భారత ఫారెక్స్ నిల్వలు 696.1 బిలియన్ డాలర్లు అని పేర్కొన్నారు. మరోవైపు దేశీయ వినియోగం బలంగా ఉందని, పెట్టుబడులు పెరుగుతున్నాయని తెలిపారు.

# అన్నదాతకు అండ

మెట్రో ఫేజ్-2కు కేంద్ర క్యాబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. రూ.13,038 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపడతారు. ప్రహ్లాద్‌పుర నుంచి తోడి-మోడ్ వరకూ 36 స్టేషన్లను కలుపుతూ 41 కిలోమీటర్ల పొడవైన నార్త్-సౌత్ కారిడార్‌గా దీన్ని నిర్మించనున్నారు. కేంద్ర, రాజస్థాన్ ప్రభుత్వం జాయింట్ వెంచర్‌గా రాజస్థాన్ మెట్రో రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ దీనిని చేపడుతుంది. ÷ూజస్థాన్‌లో హెచ్‌పీసీఎల్ ర్గి÷నైర్ కోసం రూ.79,459 కోట్లను కేటాయిస్తూ కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. అరుణాచల్ ప్రదేశ్‌లోని కమ్లే, క్రా దాది-కురుంగ్ కుమే జిల్లాల్లో రూ.26,069.50 కోట్లతో 1720 మెగావాట్ల ఎలక్ట్రిక్ ప్రాజెక్ట్ నిర్మాణానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు 96 నెలల్లో పూర్తవుతుందని అంచనా వేశారు. కాగా, అరుణాచల్ ప్రదేశ్‌లోని అంజావ్ జిల్లాలో 1200 మెగావాట్ల కళాయి-2 హైడ్రో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.14,105.83 కోట్లు కేటాయిస్తూ కేంద్ర మంత్రివర్గం మరో కీలక నిర్ణయం తీసుకుంది.

# సిఎం రేవంత్‌తో ఘనా హైకమిషనర్ భేటీ

మొదటిపేజీ తరువాయి



అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టాటా ఏరో స్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ టిమ్ రైఫిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. భారతదేశంలో ఎప్-130ఏ సూపర్ హెర్క్యులస్ ఫైనల్ అసెంబ్లీ లైన్‌ను ఏర్పాటు చేయనున్న లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ. అంతర్జాతీయ అవసరాల కోసం భారతదేశంలోని టిఎఎస్ఎల్ లో ఈ-16 వింగ్స్ ను ఉత్పత్తి చేసేందుకు లాక్‌హీడ్ మార్టిన్ సంస్థ ఒప్పందం కుదుర్చుకున్నది. తెలంగాణలో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నట్లు ఈ సందర్భంగా టిమ్ ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

# కేరళం, అస్సాం, పుదుచ్చేరిల్లో నేడు పోలింగ్

మొదటిపేజీ తరువాయి

2.71 కోట్ల మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఓటింగ్‌కు అనుమతిస్తారు. ఇక్కడ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్‌లు తలపడుతున్నాయి. కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో 30 స్థానాలకు గురువారం ఓటింగ్ నిర్వహించనున్నారు. ఇక్కడ 9 లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారు. ఈశాన్య రాష్ట్రం అస్సాంలో 126 స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. 2.4 కోట్లకు పైగా ఓటర్లు బిజెపి ప్రభుత్వ భవిష్యత్‌ను నిర్ణయించనున్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకే అస్సాంలో ఓటింగ్‌కు అనుమతించనున్నారు. ఈ మూడు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను మే 4న వెల్లడిస్తారు.

# కాళేశ్వరం మోటర్లను దెబ్బతీసే కుట్రలు

## సరైన మెయింటెనెన్స్ లేకుండా చేస్తే ఎలా?

## మంత్రి ఉత్తమ్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ

**హైదరాబాద్ ఏప్రిల్ 8 (ప్రజావినికిడి):**



కాళేశ్వరానికి సంబంధించి భారీ నీటిపారుదల మోటార్లను ధ్వంసం చేసే కుట్ర సాగుతోందంటూ కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ధ్వజమెత్తారు. భారీ నీటిపారుదల మోటార్లను ఇష్టానుసారంగా ఆన్, ఆఫ్ చేయడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు.ప్రాజెక్టుల్లోని భారీ మోటార్లను నిబంధనలకు విరుద్ధంగా పదే పదే ఆన్, ఆఫ్ చేస్తూ అశాస్త్రీయంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇలా చేస్తే వైబ్రేషన్స్ వచ్చి పంపులు, ఇంపెల్లర్స్, మోటార్స్ పాడయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెపం నెట్టేందుకే ఉద్దేశపూర్వకంగా మోటార్లను పాడు చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వ పాలనాపరమైన నిర్లక్ష్యమా లేక కావాలనే చేస్తున్న కుట్రనా అని నిలదీశారు. భారీ మోటార్లు నిరంతరాయంగా నడిచేలా డిజైన్ చేసినవి, పదే పదే ఆపితే తీవ్ర నష్టం తప్పదని హరీశ్‌రావు హెచ్చరించారు. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన ప్రాజెక్టులను ఇలా నిర్లక్ష్యంగా వాడటం శోచనీయమని మండిపడ్డారు. చందలాపూర్ సహా ప్యాకేజీ 6, 8, 10, 11, 12 లలో మోటార్ల ఆపరేషన్ తీరు తీవ్ర అభ్యంతరకరమని తెలిపారు. తక్షణమే మోటార్లను పదే పదే ఆన్, ఆఫ్ చేసే అశాస్త్రీయ విధానాన్ని ప్రభుత్వం మానుకోవాలని సూచించారు. ఇంజనీరింగ్ నిబంధనల ప్రకారం, డిజైన్ కు అనుగుణంగా నిరంతరాయంగా పంపులు నడిపించాలని తెలిపారు. మీ రాజకీయాల కోసం తెలంగాణ రైతుల జీవనాడి అయిన ప్రాజెక్టులతో చెలగాటం ఆడొద్దని హెచ్చరించారు.

# మంత్రులపై బురదజల్లడమే బిఆర్ఎస్ పని

మొదటిపేజీ తరువాయి

సర్వే నంబర్ 613లోని భూములను 2014లో మూడు సంస్థలకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేసిందని తెలిపారు. భూముల మ్యుటేషన్ జరిగిన 2016లోనూ వారి ప్రభుత్వమే ఉందన్నారు. 2014, 2016లో జరిగిన రిజిస్ట్రేషన్లతో ఈ ప్రభుత్వానికి ఏం సంబంధమని ప్రశ్నించారు. హరీశ్ రావు చెబుతున్న భూముల్లో 2022లోనే నిర్మాణాలు ప్రారంభించారు. భూములు పొందిన వారు నాలా కన్వర్షన్ ఇవ్వట్లేదని 2022లోనే సుప్రీంకోర్టుకు వెళ్లారు. వాళ్లు కోర్టుకు వెళ్తే బీఆర్ఎస్ ప్రభుత్వం కనీసం కౌంటర్ కూడా దాఖలు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. అవి ప్రభుత్వ భూములు అని చెప్పి మేం కౌంటర్ వేశాం అని అన్నారు.. ఆనాడు వాటాల ఒప్పందం చేసుకుని భూములు కట్టబెట్టి ఇవాళ మా మీద నిందలు వేస్తున్నారు. నాదర్ గుల్ భూముల్లో వాటా రాకపోవడంతో హరీశ్ రావు ఇవాళ తెరపైకి తెచ్చారని మండిపడ్డారు. ప్రొహిబిటెడ్ భూముల్లో ఈ ప్రభుత్వం ఎలాంటి మార్పులు చేయలేదు. హరీశ్ రావు చెబుతున్న కంపెనీల్లో నా కుటుంబ సభ్యులెవరూ లేరు. నా కుటుంబ సభ్యులు ఉన్నారని నిరూపించాలని సవాల్ చేస్తున్నా. వట్టి నాగులపల్లి భూముల్లోనూ హరీశ్ రావు పూర్తిగా దుష్ప్రచారం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల వివాదాన్ని కూడా ఈ ప్రభుత్వానికి అంటగట్టారని మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రభుత్వంపై అసత్యాలు



ప్రచారం చేయడమే బీఆర్ఎస్ నేతలు పనిగా పెట్టుకున్నారంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగరేణిలో అవకతవకలని ఉప ముఖ్యమంత్రిపై తప్పుడు ప్రచారం చేశారని అన్నారు. సన్న బియ్యం పట్ల ప్రజల్లో వచ్చిన ఆదరణ జీర్ణించుకోలేక పౌర సరఫరాలో అవినీతి అంటూ మంత్రి ఉత్తమ్ పై మరో పుకారు పుట్టించారని అన్నారు. లిక్కర్ బాటిల్స్ కి వేసే స్టిక్కర్ల విషయంలో, టెండర్ల విషయంలో అవకతవకలు అంటూ లిక్కర్ విషయంలో ఎక్సయిజ్ శాఖ మంత్రి జూపల్లి మీద కూడా అదే రకంగా నిందలు వేశారని మండిపడ్డారు. దేశంలో కొన్ని రాష్ట్రాల్లో చేపట్టే హ్యామ్ సిస్టంలో రోడ్ల నిర్మాణం చేపడితే... బీఆర్ఎస్ ఉనికికి ప్రమాదం వస్తుందని.. మంత్రి కోమటిరెడ్డిపై తప్పుడు ప్రచారం చేశారని.. క్రషర్లు అంటూ తనపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని పొంగులేటి అన్నారు. ఇలా ప్రతి మంత్రి మీద తప్పుడు ప్రచారం చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతల మీద ఉన్న బురదను ప్రభుత్వం మీద చల్లితే..వారు శుభ్రంగా ఉంటామని భ్రమలలో బతుకుతూ అసత్యాలని నిజాలు ప్రచారం చేస్తున్నారని

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
గురువారం 9 ఏప్రిల్ 2026

# కేసీఆర్, కేటీఆర్,హరీష్

# అసత్యాలు ఆపకుంటే ఖబడ్దార్

నా తప్పులను నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా

బిఆర్ఎస్ నేతల అవినీతి బురదను మాకు అంటించాలని చూస్తున్నారా?

నాదర్ గుల్ భూములపై కర్త కర్మ క్రియ బిఆర్ఎస్ ప్రభుత్వమే

2014లో ప్రారంభమైన వారి దోపిడీ 2023 వరకూ సాగింది

ఆ భూమిపై మేమే కోర్టుకు వెళ్లి కొట్లాడుతున్నాం

హరీష్‌రావు ( అబద్దాల రావు) కేటీఆర్ ( డ్రామారావు), కేసీఆర్ ( శకుని మామ) పూర్తి అవినీతిపరులు

అధికారంలోకి రాకముందు వారి ఆస్తులు ఎంత? ఇప్పుడు వారి ఆస్తులు ఎంత?

అది గుమస్తా తెలంగాణ పేపర్, దాని ఆత్మ శకుని మామ

కల్వకుంట్ల కుటుంబ అవినీతికి ఆహోమ్- ఈహోమ్ అనే మైహోమ్ అండగా ఉంది

బురదపూసుకున్న అడవిపంది సింహానికి బురద అంటించే ప్రయత్నం

రాఘవ కనస్ట్రక్షన్ మోచేతి నీరు తాగిన కేసీర్ కేటీఆర్ హరీష్‌రావులు గతం మరచిపోవద్దు

అబద్దాల హరీష్ రావు ఆరోపణలపై 'సింహం'లా విరుచుకుపడ్డ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వట్టినాగులపల్లి వివాదం మీ 'కుటుంబ పంచాయితీ'.. ప్రభుత్వానికి ఏం సంబంధం?

కొత్వాల్‌గూడ క్రషర్‌పై అసెంబ్లీ సాక్షిగా పచ్చి అబద్ధాలు...



**హైదరాబాద్,(ప్రజావినికిడి):**

ఇటీవలి కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వంపైనా, పలువురు మంత్రులపైనా బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ డైరెక్షన్‌లో హరీష్‌రావు, కేటీఆర్‌లు చేస్తున్న పలు ఆరోపణలపై రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్రంగా స్పందించారు. బుధవారం నాడు సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రులు శ్రీమతి సీతక్క, పొన్నంప్రభాకర్ , ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, సామెల్ , బి.లక్ష్మారెడ్డి, శ్రీ గణేష్, రాంమోహన్ రెడ్డి తదితరులతో కలిసి తనదైన శైలిలో బిఆర్ఎస్ పై విరుచుకుపడ్డారు.

శకుని మామ కేసీర్ డైరెక్షన్‌లో అబద్దాల హరీష్‌రావు, డ్రామారావు కేటీఆర్ లు మా ప్రభుత్వం, మా మంత్రులపై సత్యదూరమైన ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు.

గత పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని కొల్లగొట్టి, ఒంటి నిండా అవినీతి బురద పూసుకున్న అబద్ధాల రావు, డ్రామా రావు, శకుని మామలు.ఇప్పుడు ఆ బురదను ప్రజా ప్రభుత్వానికి అంటించాలని చూస్తున్నారని రె మంత్రి ధ్వజమెత్తారు. నాదర్గుల్, వట్టినాగులపల్లి మరియు కొత్వాల్‌గూడ అంశాలపై మంత్రి ఆధారాలతో సహా ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పికొట్టారు

మంత్రి పొంగులేటి మాటల్లో... "నాదురుగుల్ లో సర్వే నెంబర్ 613 నాదురుగుల్ గ్రామంలో, బాలాపూర్ మండలం, రంగారెడ్డి జిల్లా. ఇందులో ఉన్న 373 ఎకరాల 13 గుంటలు. ఇది ప్రైవేటు భూమిగా, కొన్ని సందర్భాల్లో 2004 నుంచి గవర్నమెంట్ భూమిగా, రకరకాలుగా అనేక కోర్టుల్లో దీన్ని కొట్లాడటం జరిగింది.ఒకసారి ప్రైవేటు పార్టీ గెలవడం,ఒకసారి ప్రభుత్వం గెలవడం, పైకోర్టులకు పోవడం,పోలీసు సపోర్ట్ కోర్ట్ డైరెక్షన్ తెచ్చుకోవడం ఆ నాటి ప్రభుత్వంలో కొన్నిజరిగాయి. దీంట్లో గమనించాల్సిన విషయం ఉంది. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం యునైటెడ్ ల్యాండ్ మార్ప్ ప్రైవేట్ లిమిటెడ్, అల్ఫా ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఒమెగా డెవలప్మెంట్స్ వెంచర్ ప్రైవేట్ లిమిటెడ్ అనే మూడు సంస్థలకు 1-9-2014 నాడు మీ ప్రభుత్వంలోనే నాదురుగుల్ గ్రామాన్ని613 సర్వే నెంబరులోఎంవ రిజిస్ట్రేషన్ చేసింది మీరు కాదా? ఈ భూమిని రిజిస్ట్రేషన్ చేసింది మీరు కాదా? ఈ రిజిస్ట్రేషన్ చేసిన డాక్యుమెంట్లను 2016 సెప్టెంబర్ 24 మ్యుటేషన్ చేసింది మీ ప్రభుత్వంలో కాదా? 2014లో కానీ, 2016లో కానీ ప్రభుత్వం ఎవరున్నారు? అధికారంలో ఎవరున్నారండి అబద్ధాల రావు గారు? ఇందాక చెప్పిన మూడు కంపెనీలకు ఫైల్ నెంబర్ బి/1351/2/2021-1-1, 2021-2, 2021-3, 2011-3 వీళ్లకు మ్యుటేషన్ చేసింది మీ ప్రభుత్వంలో అవునా కాదా? ప్రతిదీ వివరాలతో కూడిన డాక్యుమెంట్ ఇస్తాను. ఇది మీ ప్రభుత్వంలో మ్యుటేషన్, రిజిస్ట్రేషన్ జరిగితే ప్రస్తుత ప్రభుత్వానికి ఏమిటి సంబంధం?

అంతేకాదు ఈ డ్రామాలరావు , ఈ అబద్ధాల రావు గారు ఎంత పచ్చి అబద్ధాలు ఆడుతున్నారో చెబుతా. 10-02-2021 గూగుల్ మ్యాప్.. చూడండి. ఇక్కడ అప్పటికీ ఏమి ఏర్పాటు చేయలేదు. ఏ రేకులు పెట్టలేదు. ఏ రోజు వేయలేదు.అదే విధంగా 05-12-2021 ఈ గూగుల్ మ్యాప్ లో కలర్ తో కొన్ని ప్రాంతాల్లో మొదలుపెట్టాడు. రేకులు కట్టడం, రోడ్లు వేయడం మొదలుపెట్టాడు. 5-12-2021 నేను చూపించే ప్రతిదీ మీకు గూగుల్ లో కనిపిస్తుంది. నేనేమి మానిప్యులేట్ చేసేది కాదు.నా ప్రభుత్వం, నా అధికారులు తయారు చేసిచ్చింది కాదు. అదే విధంగా 5-1-2022 రేకులు, రోడ్లు వేసింది గూగుల్ పిక్చర్ లో కనిపిస్తుంది. 17-11-2022లో పూర్తిగా కలర్ తో మీకు స్పష్టంగా కనిపిస్తుంది. దీన్ని 2022-11 నెలలో పూర్తిగా మీ టైంలో షీట్లు పెట్టి దానికి పూర్తిగా రోడ్లు వేసింది మీ ప్రభుత్వంలో కాదా? ఎవరున్నారండి అధికారంలో ఆ నాడు అబద్ధాలు రావు గారు, డ్రామా రావు గారు. 2022 నవంబరులో మీ దొర పాలనే ఉంది కదా? ఇది నేను తయారు చేసింది కాదు కదా? ఇలా ప్రతి మ్యాపులో ప్రజాప్రభుత్వం వచ్చే వరకు ఐదు మ్యాపులు తెప్పించాను. ప్రతి మ్యాపులో 373 ఎకరాల 22 గుంటలకు నీ దొరల పాలనలోనే పూర్తిగా రేకులు పెట్టించింది మీరు. దాన్ని ఈ ప్రభుత్వం మీద ఈ మంత్రి మీద నిందలు మోపుతావా? ఎవరేశారు రేకులు? రిజిస్ట్రేషన్ ఎవరి టైంలో జరిగింది? మ్యుటేషన్ ఎవరి టైంలో జరిగింది?

ఇంకో విచిత్రం ఏమిటంటే.. వాళ్లు నాలా చేయమంటే మేము చేయమన్నాం, నాలా చేయం అన్నందుకు కోర్టుకు పోయారు. కోర్టుకు పోయి కొట్లాడినం అంటున్నారు. కోర్టుకు 2022లో ఎస్ఎల్పీ నెంబర్ 15415-2022లో వారు సుప్రీంకోర్టుకు పోతే ఆ ఎస్ఎల్పీకి 2022లో పోతే మీ ప్రభుత్వం ఉన్నంత వరకు కౌంటర్ వేయలేదు. అంటే ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత 17-03-2025 ముఖ్యమంత్రి గారి నాయకత్వంలోని ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత రెవెన్యూ కేసులు ఏ కోర్టులో పెండింగ్ ఉంటున్నాయని పరిశీలించిన తరువాత, దీని మీద ప్రభుత్వ పక్షాన పూర్తిగా కౌంటర్ మా ప్రభుత్వం తరువాత వేసింది. మా ప్రభుత్వం వచ్చిన ఇది ప్రభుత్వ స్థలము, దీన్ని నాలా చేయలేము అని ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత మేమేశాం. మీరు వేయలేదే? కౌంటర్ వేసింది మేము. దీనిపై కొట్లాడుతుంది మేము.

మరొక విచిత్రం ఇది గుమస్తా తెలంగాణ పేపర్. ఈ గుమస్తా తెలంగాణ శకుని మామ ఆత్మది. శకుని మామ ఆత్మ గుమస్తా తెలంగాణలో కొట్లాడుతుంటది. ఈ గుమస్తా తెలంగాణలో హెడ్ లైన్ చూశారు. ఈ జాగీర్ లోకి మెగా ఎంట్రీ. ఈ జాగీర్ లోకి మెగా ఎంట్రీ అని గుమస్తా తెలంగాణలో అబ్యానర్ ఐటం రాస్తారు. రాసి మూడో రోజు ఈ ఐటం రాసిన మూడో రోజే మళ్లీ బ్యానర్ ఐటం. పొంగులేటి ఈ స్థలం కబ్జా. మొదటి రోజు మెగా కబ్జా అని రాస్తావ్, మూడో రోజు పొంగులేటి కబ్జా అని రాస్తావ్. దీంట్లో ఆంతర్యం ఏమిటి? నాకు తెలిసి ఈ మెగా ఆత్మ, ఈ శకుని ఆత్మ, ఈ శకుని పార్టీకి ఈ మెగా ఏం చేసిందో మీకు తెలియంది కాదు. ఐతే ప్రభుత్వం మారిన తరువాత ఆ ప్రభుత్వం దిగిపోయి ప్రజాప్రభుత్వం వచ్చిన తరువాత ఈ మెగా ఈ ల్యాండ్ ను చేసుకుంటే వారికున్న డీల్స్ ఎవైతే ఇవ్వము అని బ్యానర్ వేసి రెండో రోజు.. ఈ గుమస్తా పేపర్ శకుని కొడుకు, అబద్ధాల రావు ఈ మెగా అధినేత రహస్యంగా కలుసుకున్నారు. మీ వాటా మీకొస్తది.మీకిచ్చేది మీకిస్తామని సెటిల్ అయిన తరువాత, దాన్ని తిప్పి ఈ ప్రభుత్వం మీద, ఈ మంత్రి మీద నింద మోపుతారు. మరి అబద్ధాల రావు రోల్ ఏంటంటే..శకుని మామ,వారి కుటుంబమే షేర్ చేసుకుంటే నా పరిస్థితి ఏమిటని ఈ అబద్ధాల రావు రంగంలోకి వచ్చి దీనిపై వానర సైన్యాన్ని వేసుకొని, ఈ ల్యాండ్ 373 ఎకరాలు ఈ ప్రభుత్వం 7వేల కోట్లు మింగింది అంటడు. అసలు నాదర్గుల్ ల్యాండ్ కి ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత నిషేధిత జాబితాలో 22ఏలో ఉన్నదా అంటే..యాజిటిజ్ గా ఉంది. ప్రభుత్వం ఎక్కడా మార్చలేదు. ఫుల్‌స్టాప్,కామా పెట్టలేదు మేమేమి క్లియర్ చేశామా అంటే చేయలేదు. మరి ఎట్ల ఊహించి ఇదంతా చేస్తున్నావు. నీ బాగోతం ఎక్కడ బయటపడుతుందోనని, పదేండ్లలో చేసిన బాగోతం ఎక్కడ బయటకొస్తుంది. రోజుకొ అబద్ధం కల్పించుకొని ప్రజల మధ్య తిరగడం తప్ప.. ఇందులో అసత్యం, సత్యం ఎంత ఉందో..నేను చూపించిన ఆధారాల ప్రకారం, అబద్ధాల రావు, డ్రామారావు, వారి అధిపతి శకుని మామ రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది. అంటే నీకు కమిషన్ వచ్చినంత వరకు నీ ప్రభుత్వంలో, మీ కుటుంబానికి సంబంధించిన ఆస్తుల పంపకం విషయం వచ్చే వరకు, అవి పరిష్కరించుకునే వరకు డ్రామారావు, అబద్ధాల రావు, శకుని, శకుని కూతురికి కూడా ఇవ్వాల్సిన వాటాలు ఇవ్వరు. కూతురుకైనా, ఏ ఒక్క ఆరోపణలకైనా అబద్ధాలరావు సమాధానం చెప్పాడా? కాళేశ్వరం, డైరీల గురించి ఎత్తుకుంది. ల్యాండ్ లు ఎలా కబ్జా చేసిందో ఎత్తుకుంది. దేనికైనా సమాధానం చెప్పిండా ఆ శకుని మామ కూతురుకు. నేను వేసే ప్రశ్నలు కాదు. నాదర్గుల్ ల్యాండ్ కు సంబంధించిన దాంట్లో రిజిస్ట్రేషన్ 2014 నీ ప్రభుత్వంలో జరిగింది. 2016 మ్యుటేషన్ చేసింది మీ ప్రభుత్వం. ఎస్ఎల్పీలో 2022లో కౌంటర్ వేయకుంటే, 2026లో కౌంటర్ వేసి కొట్లాడుతుంది మేము. 2021 నుంచి 2022 చివరి వరకు దాని చుట్టూ రేకులు పెట్టించి రోడ్లు వేయించింది మీ టైంలో. ఈ ప్రభుత్వానికి ఏం సంబంధం? ఎందుకు ప్రభుత్వంలోని మంత్రులను, నన్ను ఎందుకు లాగుతున్నావు?

ఇంకో విచిత్రమైన ఆరోపణలు చేస్తున్నారు దీంట్లో.. నా కొడుకు హర్షా రెడ్డి గురించి చెబుతాడు. దీంట్లో పార్టనర్ అంటాడు. ఏ మూడు కంపెనీలు దీంట్లో పార్టనర్లు అంటున్నాయో, ఏ కంపెనీలో ఈ భూమిని క్లెయిమ్ చేస్తున్నాయో, ఆ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలలో నా భార్య కానీ,నా కొడుకు కానీ, నా కుటుంబ సభ్యులు కానీ ఎవరైనా ఉంటే.. ఛాలెంజ్.. అబద్ధాలు రావు.. ఏదో మ్యాటర్ తీసుకొచ్చి, అవుట్ డేటెట్ కేస్ తెచ్చి, దాన్ని ఇదిగో అని అబద్ధాన్ని పేపర్ చూపించి చిత్రీకరించొద్దని ఖబర్దార్ అని వేదికగా హెచ్చరిస్తున్నా.

ఇక రెండో అంశం వట్టినాగులపల్లిది.. ఇదొక బాగోతం. ఇదొక పచ్చిబూతు. ఇది షా కుటుంబానికి సంబంధించిన కుటుంబ పంచాయితీ. వారందరూ కుటుంబ సభ్యులు. ఎప్పుడో 60-70 సంవత్సరాల క్రితం కొనుకున్న భూమి. కుటుంబానికి సంబంధించిన భూమిలో ఒక పార్టనర్ దగ్గర ఆ ప్రభుత్వానికి సంబంధించిన వాళ్ళ టైంలో జరిగింది ఏదైతే ఉందో.. వట్టినాగులపల్లి కుటుంబ విషయాన్ని ప్రభుత్వానికి అంటగడతారు. ప్రభుత్వ మంత్రులకు, కుటుంబ సభ్యులకు అంటగడతారు. అక్కడ యదార్థం ఏంది? దాంట్లో నీ స్వార్థం ఏంటి? ఏ లాభ ఆక్షేపణ లేకుండా ఈ అబద్ధాల రావు కానీ,ఈ డ్రామాల రావు కానీ, శకుని మామ కానీ లాభ ఆక్షేపణ లేకుండా పుల్ల తీసి ఇటు పెట్టరు. వారికొచ్చిన లాభమేంటో చెబుతాను. షా కుటుంబానికి సంబంధించిన ఒక కుటుంబ సభ్యుడి దగ్గర ఒక కంపెనీ డెవలప్మెంట్ తీసుకుంది. ఆ కంపెనీలో నా కొడుకు కూడా భాగస్వామి. ఆ కంపెనీ డెవలప్మెంట్ కు తీసుకుంటే, ఆ డెవలప్మెంట్ కు సంబంధించిన షా కుటుంబానికి సంబంధించిన ఆస్తి.. ప్రజలంతా వివరాలను చూడాల్సిందిగా విన్నవిస్తున్నా. ఇది వట్టినాగులపల్లిలో వారు చెబుతున్న భూములు. ఈ భూముల్లో ఏందయ్యా అంటే.. మ్యాప్‌లో గ్రీన్ కలర్ సంబంధించినది. ఆ హోమ్, శ్రీఈ హోమ్ అని పెద్ద రియల్ ఎస్టేట్ కంపెనీ ఉంది కదా..అబద్ధాల రావు, డ్రామారావు, శకుని మామకు సంబంధించిన సంస్థ ఆ హోమ్, ఈ హోమ్ అని ఒకటి ఉంటుంది. దానికి సంబంధించిన సంస్థ ఈ గ్రీన్ కలర్ కు సంబంధించింది డెవలప్మెంట్ తీసుకుంది. ఈ బ్లూకలర్ కు సంబంధించింది ఇంకొకరు తీసుకున్నారు. దాంట్లో నా కొడుకు ఒక భాగస్వామి. ఒక ఈ రెడ్ కలర్ కు సంబంధించింది షా కుటుంబం పంచాయితీ ఉంది. అది వారి అన్నదమ్ములది. దీంట్లో ఆనాడు దివంగత నేత రాజశేఖర్ రెడ్డి ఓఆర్ఆర్ ఏర్పాటు చేసేటప్పుడు, ఓఆర్ఆర్ లో సర్వే నెంబర్లకు చెందని కొంత ఆస్తి ప్రభుత్వం సేకరించింది. సేకరించినప్పుడు భూమి తగ్గింది. భూమి ప్రభుత్వం తీసుకున్న తరువాత ఏదైతే బలవంతులు ఉంటారో,ఎవరైతే అధికార పార్టీ అండ ఉంటదో, వారిది నాదని ఫెన్సింగ్ వేసుకొని డిమార్కేషన్ చేసుకుంటారు. అలా చేసుకున్నదే ఈ గ్రీన్ పార్ట్. ఆ హోమ్, ఈ హోమ్ అనే కంపెనీ ఒక ఓనరు దగ్గర నుంచి చేసుకుంది. షా కమ్యూనిటీకి సంబంధించింది కాదు. ఈ ఆ హోమ్ ఈ హోమ్ ఏదైతే ఉందో.. వీళ్ల కోసమని ఈ ఓఆర్ఆర్ పోయిన భూమి తమకు సంబంధం లేదు. మా బిట్ ఇదని ఈ గ్రీన్ పార్ట్ కు సంబంధించిన 21 ఎకరాల 28 గుంటలు పొజిషన్ లోకి వచ్చారు. ఎప్పుడైతే ఓఆర్ఆర్ పోయిందో. అది పోయిన తరువాత ఆ ఓఆర్ఆర్ వాళ్ల షేర్ డిలీట్ చేసుకోకుండా ఆ కుటుంబంలో వచ్చిన సమస్య. దానికి ప్రభుత్వానికి సంబంధం లేదు.

19-08-2023 నాడు సుప్రీం కోర్టు ఆదేశాలనుసారం, ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందనగా ఈ భూమిని ఆ శకుని మామకు సంబంధించిన ఆ హోమ్,ఈ హోమ్ అనే కంపెనీ డెవలప్మెంట్ కు తీసుకున్న భూమిని నాలా కన్వర్షేన్ ఆ నాటి ప్రభుత్వం చేసింది. ఎన్నికలకు 15 రోజుల ముందు. చేసి దాంట్లో అనేక లావాదేవీలు పెట్టుకొని దాన్ని చుట్టూ ఫెన్సింగ్ చేశారు.రేకులు పెట్టారు. పెట్టి దాన్ని పొజిషన్ లో తీసుకున్నారు. అమాయకుడైన సర్వే నెంబర్ 245, షాకు సంబంధించిన కుటుంబ సమస్య ఏదైతే ఉందో.. ఈ భూమి అతన్ని రెచ్చగొట్టి దాన్ని పరిపరి విధాలుగా చిత్రీకరించారు. దానికి కారణంగా గ్రీన్ లో రావలసిన లావాదేవీలు, యదార్థంగా పోయిన భూమి తగ్గితే వారి షేర్ తగ్గుతుంది. అందుకే షేర్ తగ్గుతుందనే లక్ష్యంతో షా ను రెచ్చగొట్టి ఈ రాద్దాంతమంతా చేసి.. దీంట్లో ప్రభుత్వానికి, ప్రభుత్వ పెద్దలకు సంబంధం ఉందని దీనికో రంగు వేస్తాడు.దీంట్లో ఇంకో పచ్చి అబద్దాం ఆడుతాడు. ఇది పల్లవి షా ఎవరైతే రెడ్ కలర్ కు సంబంధించిన ఓనర్లలో ఒక ఓనర్ కూతురు. ఆమె డిస్ట్రిక్ట్ కలెక్టర్ కు లెటర్ రాశారు. సర్వే చేయాల్సిన నోటీసు మాకు అందింది. అసలు ఈ సర్వేకు సంబంధించిన మా భూమి ఇది అని ఆమె నోటీసు అందినట్లు ఆక్నాలెడ్జ్ మెంట్ కు సంబంధించిన విషయం లెటరులో ఉంది. ఆమె స్వయంగా రాసిన లెటర్. వీరేమంటారంటే అసలు వాళ్లు నోటీసు ప్రభుత్వం సర్వే చేస్తున్నట్లు ఇవ్వలేదు. సర్వే చేసేది షా కుటుంబానికి తెలియదని విచిత్రమైన ఆరోపణలు చేస్తున్నారు. అసలు రహస్యంగా మళ్లీ చెబుతున్నా, దీంట్లో నా కొడుకు కేవలం డెవలప్మెంట్ కు తీసుకున్న కంపెనీలో పార్టనర్. అది డెవలప్మెంట్ కు తీసుకున్నాం తప్ప కొనలేదు. దాన్ని సర్వే చేయడానికి నోటీసు ఇస్తుందన్నది వారు. దీంట్లో అబద్ధాల రావు, డ్రామా రావు కంపెనీ ఎంటర్ అవ్వడానికి కారణం ఆ హోహ్, ఈ హోమ్ కు సంబంధించిన కొంత భూమి ఓఆర్ఆర్ పోయింది తగ్గితే, కోరేటర్ తగ్గుతందని దాన్ని ప్రభుత్వంపై రుద్దడం బాధాకరం. కోర్టులో వివాదం ఉంది.కోర్టు ఏ రకమైన తీర్పు ఇస్తే ప్రభుత్వం ఆ తీర్పుకు కట్టుబడి ఉంటుంది. దీంట్లో ప్రభుత్వం ప్రత్యేకమైన ఇంట్రెస్ట్ ఏమి ఉండదు.

కొత్వాల్‌గుడా విషయంలో అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం మీద ఎలా అబద్ధాలు మాట్లాడాడో..అది కూడా పచ్చిఅబద్ధాలు. అబద్ధాల రావు గురించి ఇది కూడా చెప్తా.దీంట్లో, ఏదైతే కొత్వాల్ గూడలో క్రషర్ కు సంబంధించిన సబ్జెక్ట్. రాఘవ కన్ స్ట్రక్షన్ హైదరాబాద్ లో రేడియల్ రోడ్డు చేస్తోంది.ఆ రేడియల్ రోడ్డు డిపార్టుమెంట్ కు తిరుమల కన్ స్ట్రక్షన్ మెటల్ సప్లై చేస్తోంది. 2007 నుంచే క్రషర్ నడచుకుంటోంది. అక్కడున్న రైతుల దగ్గర ల్యాండ్ లీజుకు తీసుకొని కుమార రాజు అనే అతను క్రషర్ నడుపుకుంటున్నాడు. అందులో ఒక చిన్న ఇల్లు అతనికి ఉంటుంది. పవర్ బిల్లువు కూడా ఉంటాయి. ఎప్పటి నుంచో వస్తున్న కరెంటు బిల్లులు ఎస్టాబ్లిష్‌మెంట్ అయ్యింది. మోకాలికి బోడుగుండుకు ముడివేసి రాఘవ కన్ స్ట్రక్షన్ సంబంధం ఉండదంటాడు. మంత్రి కుటుంబానికి సంబంధం ఉంటుందంటాడు. తిరుమల మెటల్ ఇండస్ట్రీస్ కరెంట్ బిల్లు అక్కడే ఉంటుంది.కరెంట్ ఉంటుంది.జీఎస్టీ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఇస్తాను.దీనికి సంబంధించిన దాంట్లో ఓఆర్ఆర్ వచ్చిన తరువాత కాలుష్యం గుర్తించి ప్రాంతంలోని క్రషర్లను సీజ్ చేశారు. తీసేయమనితీ ఆదేశించారు. క్రషర్ తీసేసిన తరువాత, రాఘవ కన్ స్ట్రక్షన్ మెటీరియర్ అవసరం ఉందో.. బుద్వేల్ లో వందలాది ఎకరాలు ఆక్షన్ పెట్టారు.ఆ ప్రదేశంలో బండను పగలకొట్టి రోడ్లు వేసి,ఆ రాక్ మక్కుకు సంబంధించిన మక్కుని క్రష్ చేస్తే తిరుమల వారి నుంచి రాఘవ కన్ స్ట్రక్షన్ కొనుకున్నారు. దానికి పూర్తి డాక్యుమెంట్లు ఉన్నాయి.ఆ క్రషర్ ఒరిజినల్ గా కర్నూలులో రాఘవ కన్ స్ట్రక్షన్ క్రషనర్,వర్క్ అయ్యాక అమ్మేటప్పుడు తిరుమల మెటల్ ఇండస్ట్రీ వాల్లు కొనుకున్నారు. క్రషర్ పెట్టుకొని కొత్తగా కోరీలు తిరుమల ఇండస్ట్రీ వారు ఏం చేయలేదు.ఒక బ్లాస్టర్ కూడా చేయకుండా, బుద్వేల్ ల్యాండ్ రోడ్లకు వచ్చే స్పాయిల్ తిరుమల ఇండస్ట్రీ మెటల్స్ వారు క్రష్ చేస్తే రాఘవ వారు కొని వాడుకోవడం జరిగింది. దీంట్లో ఆర్టీఏ కింద అబద్ధాల రావు టీం,డిపార్ట్మెంట్ వాళ్లను లెటర్ అడుగుతారు, దాంట్లో మైనింగ్ వారు,అసెంబ్లీలో ఇదిగో పేపర్ అని చూపించేది, రాఘవ ఎంత సీనరైజ్ కట్టాలని చూపిస్తారు.ఆ మెటల్ కు సంబంధించిన సీనరైజ్ అనేది హెచ్ఆర్డీసీఎల్ రేడియల్ రోడ్ ఫార్మేషన్ చేసే డిపార్ట్మెంట్, వారు రెండు కోట్ల 77 లక్షలు కడతారు, నిన్ననో మొన్ననో మళ్లీ కట్టారు. అయితే క్రషర్ కు , రాఘవ సంస్థకు సంబంధం ఏంటి. మొదటి నుంచి తిరుమల మెటల్ ఇండస్ట్రీ వారిదనేది ఆధారం ఉంది. పూర్తి ఎస్టాబ్లిష్మెంట్ డాక్యుమెంట్ ఉంది.అయితే దీనికి సంబంధించిన దాంట్లో ఏదైతే తిరుమల మెటల్ ఇండస్ట్రీకి సంబంధించిన దాంట్లో జీఎస్టీ, ఇతర రాత్ర కూడా పూర్తి ఆధారాలతో ఉన్న పేపర్లు మీకిస్తా..పవర్ బిల్,ప్రతిదీ ఉంటుంది.రాఘవ కన్ స్ట్రక్షన్ కు, క్రషర్ కు సంబంధం ఏంది? ఎట్లంటవు? అంటే ఇదిగో అధ్యక్ష అని అసెంబ్లీలో చెబతాడు.ఆ అబద్ధాల రావు ఉరి వేయమంటడు.. లీటర్ పెట్రోల్ కొనడానికి వంద రూపాయలు ఉంటుంది కానీ, అగ్గిపెట్ట లేదన్నదాంట్లో అబద్ధం ఎంతుందో..ఇది కూడా అంత అబద్ధం.నిజాలను అబద్ధాలు, అబద్ధాలను నిజాలుగా చిత్రీకరించాలని తాపత్రయం.

గ్రామీణ ప్రాంతాల్లో చిన్న కథ చెప్పుకుంటారు. అటవీ ప్రాంతాల్లో జీవరాశులు ఉంటాయి. జీవరాశులు ఒకరోజు ఒక సింహం, ఒక పంది ఎదురుపడ్డాయంట.సింహం అడవి పంది ఎదురుపడ్డాయంట.పంది ఈ సింహాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నం చేస్తుందట. నువ్వేం చేయలేవు, నువ్వది చేయలేవు, నువ్విది చేయలేవు. ఎత్తుగా లావుగా ఓ ఉన్నవ్ అని ప్రేలాపనలు పలుకుతుందట. పేలి సింహానికి ఒక స్టేజీలో కోపం వచ్చిందట..

వస్తే సింహం రెండొడగులు ముందుకు వేసేసారికి అడవి పంది పక్కనే పెద్ద బురద గుంటలో పోయి..మొత్తం బురద పూసుకొచ్చి ఇప్పుడు రమ్మంటుందట. అది బురద రాసుకుంటే, సింహం బురద రాసుకుంటది.. పది సంవత్సరాల్లో ఏదైతే రాష్ట్రాన్ని కొల్లగొట్టి ఆ బురదని ఈ ప్రభుత్వానికి అంటగట్టాలని ఎంత తాపత్రయం పడుతోందో..ఆ టీం అబద్ధాల రావు గానీ,డ్రామా రావు గానీ,శకుని మామ కానీ ఎలా తాపత్రయ పడుతున్నారో మనకు చాలా స్పష్టంగా కనిపిస్తోంది. అంతేకాదు ఒక్క మూడు అంశాలే కాదు,ప్రతిరోజూ నిరంతరం ఒంటి నిండా విషం నింపుకొని,ఈ విషాన్ని ఎట్ల, మనం ఎట్లా మునిగిపోయం, ఒంటి నిండా ఎలా బుదర అంటింది. ధరణిలో జరిగిన అవకతవకలు ఒక్కోటి బయటకు వస్తున్నాయి. ఫోరెన్సిక్ ఆడిట్ లో రెండు జిల్లాలది వచ్చింది.మిగతా జిల్లాలది రాబోతుంది. అవన్నీ పెట్టక ముందే, మనకంటిన బురద వారికి పూస్తే ఇద్దరం బురద రాసుకున్నోళ్లం అవుతామని పగటి కలలు కంటున్నారు.మీరు అధికారంలోకి రాకముందు, అధికారంలోకి వచ్చి,అధికారంలో దిగే ముందుకు డ్రామాలరావు కానీ, అబద్ధాల రావు కానీ,శకుని మామ గారెకి కానీ,వారి కుటుంబానికి ఉన్న ఆస్తులెంతా? ఈనాడు మీకున్న ఆస్తులెంత.మీ పార్టీకి దేశంలో ఏ ప్రాంతీయ పార్టీకి లేని నిధులు ఎక్కడి నుంచి వచ్చాయి? మీరంటున్నారు అసెంబ్లీలో అబద్ధాలు రావు అంటున్నారు. డ్రామారావు చప్పట్లు కొడతారు. రాఘవ కన్ స్ట్రక్షన్స్ ఎవరిదో మీకు తెలియదా అని అడుగుతున్నారు. రాఘవ కన్ స్ట్రక్షన్ మోచేతి నీరు తాగినోళ్లు మీరు. ఎవరిదో ప్రజలకు తెలుసో లేదో కానీ, ఈ అబద్ధాల రావు, డ్రామా రావుకు బాగా తెలుసు. అంతేకాదు మాయమాటలు చెప్పి, తడి బట్టతో నా గొంతు కోసిన తరువాత,నీ పార్టీకి ఇదే రాఘవ కన్ స్ట్రక్షన్ నుంచి అధికారికంగా కోటి రూపాయలు ఇచ్చానని మరచిపోయావా అబద్ధాల రావు. అప్పుడే తిన్నింటి వాసాలు లెక్కపెడుతున్నావా డ్రామాలరావు? మోచేతి నీళ్లంటే కోటి రూపాయలతో కాదు.ఈస్టోరీ మీ అంతరాత్మకు తెలుసు. అంతేకాదు ముఖ్యమంత్రి శాసనసభ సమావేశంలో డైరెక్టుగా చెప్పారు..మీకు చా లెంజ్ విసిరారు. ఈ ప్రభుత్వంలో ఉండి ఏ మైనింగ్ కు రాఘవ కన్ స్ట్రక్షన్ సంబంధం ఉందని..రోడ్లకు మెటల్ పంపే కంపెనీ మీద సీబీసీఐడీ ఎంక్వైరీ వేస్తూ, ప్రభుత్వంలో ఉన్న ఒక సభ్యుడిపై ఆరోపణలు చేస్తే, చిత్తశుద్ధితో ముఖ్యమంత్రి ఆ కంపెనీకే కాదు,విదేశాలకు వేలాది కోట్ల రూపాయల సంపద తరలించిన కంపెనీలపై కూడా సీబీసీఐడీ విచారణ.2014 తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు జరిగిన గనుల శాఖ పది సంవత్సరాల పాలనలో అబద్ధా లరావు, డ్రామారావు,శకుని మామ ముగ్గురే మంత్రులు.ఈ ముగ్గురు ఎన్ని సెక్టార్లలో దోచుకున్నారో ప్రతిదీ ఈ సీబీసీఐడీ ద్వారా ఎంక్వైరీలో వస్తుంది. అంతేకాదు ముఖ్యమంత్రి నాయకత్వంలోని ఈ ప్రభుత్వం పారదర్శకంగా ఉంటుందో చూడండి.

వట్టినాగులపల్లిలో ఒక వ్యక్తి కంప్లైంట్ ఇస్తే..ఎవరి పేరైతే దాంట్లో రాశారో దాన్ని కూడా ప్రభుత్వంలో ఉన్నా మీలాగా వారి పేర్లు తీయకుండా ఎఫ్ఐఆర్ చేసింది. అది మా చిత్తశుద్ధికి నిదర్శనం, మీలాగా ప్రభుత్వంలో ఉన్నారని, ప్రభుత్వ పెద్దలు కంప్లైంట్ ఇచ్చిన మాత్రంలో ఆ పేర్లు తీసేయాలని ఎవరు చెప్పలేదు. చెప్పరు కూడా. అయినా యాజిటిజ్ గా ఉన్న పేర్లు ఎఫ్ఐఆర్ చేశారు. రేపు విచారణలో.. కోర్టు పరిధిలో ఉన్న అంశంపై ఎక్కువ మాట్లాడను. విచారణలో చేసిందెవరో, చేయించిన దాని వెనుక ఎవరి పాత్ర ఉందో,ఏ హోమ్ పాత్ర ఉందో..ఆ హోమ్ కు వత్తాసు పలికేదెవరో తప్పకుండా వస్తుంది.

గ్రామీణ ప్రాంతాల్లో ఇంకో సామెత ఉంది. గజ్జికుక్క..ఊళ్లో ఒక సావు,ఒక శుభ అశుభ కార్యం జరుగుతుంటే వంటలు ఏర్పాటుచేస్తారు. వంటలు చేసేటప్పుడు కొన్ని గజ్జి కుక్కలు ఉంటాయి అక్కడ. ఆ గజ్జి కుక్కను వంటల దగ్గరకు రావొద్దని వంట వారు పారద్రోలాలని చూసి ఆ గజ్జి కుక్క పోతుందా. అక్రమ ఆస్తులు, సంపాదన కోసం వంటల్లాంటి ప్రభుత్వ సొమ్ముని కొల్లగొట్టాలని, ఇంకా దౌర్జన్యం చేసి బెదిరించి భయపెట్టి, అధికారంలో మేమే ఉన్నామని పరిపరి విధాలుగా ఆలోచిస్తూ,ఇంకా అధికార దర్పాన్ని ప్రదర్శించాలని చూస్తే గజ్జికుక్క పట్టిన గతే పడుతుంది.

వారి అక్రమ ఆస్తులను కాపాడుకోవడం కోసం, భయభ్రాంతులను చేయాలని ఇలా తాటాకు చప్పుళ్లు చేస్తేనో,ఇలా కారుకూతలు కూస్తేనో,ఇందాక చెప్పిన గజ్జికుక్క, అడవి పందిలా చేస్తేనో ప్రభుత్వం భయపడదు. చాలా స్పష్టంగా చెబుతున్న, అడవి పంది ఎలా బురదను పూసుకొచ్చి సింహానికి పూయాలని తాపత్రయ పడితే, ఆ సింహం తిరగబడి అడవి పందిని బురదలోంచి లేకుండా తొక్కి చూపిస్తుంది.మీ అక్రమాలు చిట్టా మీ భూదందాల చిట్టా,మీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన లిస్టులు ఒక్కొక్కటి మా మిత్రలూూ ఇస్తున్నారు. ఒక్కొక్కటి బయటకు తీసే సందర్భంగా తప్పకుండా తొందర్లో ఉంటుంది. ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోంది "అని అన్నారు

# 'సువర్ణ సంపద' తాటి చెట్ల కథ కంచికేనా..?

**అక్రమంగా తాటి వనాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలేవి..**

**అసలు సూత్రధారులపై కేసులు నమోదయ్యేనా..**

**చర్యలు తీసుకునేందుకు ఇంత జాప్యం ఎందుకు..?**



**షాద్ నగర్, (ప్రజావినికిడి):**
ఇష్టం వచ్చినట్లు తాటి చెట్లను ధ్వంసం చేసి గౌడ సమాజానికి తీవ్ర నష్టం కలగజేసిన సంఘటన షాద్ నగర్ మున్సిపల్ పరిధిలో ఇటీవలే చోటు చేసుకుంది.అయితే తాటి చెట్లను ధ్వంసం చేసిన వారు తమకు తాటి చెట్లను తొలగించేందుకు 2019 లోనే అనుమతులు పొందామని ఆర్డర్ కాపీ చూపించి తప్పించుకునే ప్రయత్నం చేశారు.ఇదిలా ఉండగా షాద్ నగర్ గౌడ సంఘం నాయకులు ఇది ముమ్మాటికి గౌడ సమాజం ఆర్థిక వ్యవస్థ మీద చేసిన దాడే నని,వెంటనే పదుల సంఖ్యలో తాటి చెట్లను నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక అబ్కారీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే తాటి చెట్లను ధ్వంసం చేసి వారం రోజుల వ్యవధి దాటుతున్నా పూర్తి స్థాయిలో సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2019 లో కృష్ణవేణి అనే పేరుతో అనుమతి పత్రాన్ని తీసుకుని స్థానిక గౌడ సంఘానికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నాటి నుంచి తాటి చెట్లను నరుకుతూ వందల సంఖ్యలో తాటి చెట్లను కనుమరుగు లేకుండా చేశారని గౌడ సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎప్పుడో అనుమతి పత్రం పొంది తప్పుడు దారిలో తాటి చెట్లను ధ్వంసం చేసిన వ్యవహారంలో సదరు వ్యక్తితో పాటుగా ఈ వ్యవహారంలో పాలు పంచుకున్న ప్రతి ఒక్కరిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.తాటి చెట్ల ధ్వంసం లో కృష్ణవేణి తో పాటుగా ఇంకా ఎవరెవరు ఉన్నారనే విషయాలను ఎక్సైజ్ అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ వ్యవహారంలో విచారణలో జాప్యం కనిపిస్తుండటంతో ప్రస్తుతం రియల్ వెంచర్ చేస్తున్న నిర్వాహకులు ఎవరైనా తమ చాతుర్యాన్ని ప్రదర్శిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఇదిలాగే కొనసాగితే తాటి చెట్లను ధ్వంసం చేసిన అసలు సూత్రధారులు తప్పించుకునే అవకాశం లేకపోలేదు.

# అట్టడుగు వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం..

## షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..

### ఏం.బి.సి కులాల అభివృద్ధి కార్పొరేషన్ పై సమీక్ష సమావేశం నిర్వహించిన ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్






**షాద్ నగర్, (ప్రజావినికిడి):**
తెలంగాణ అసెంబ్లీ లో ఏం.బి.సి కులాల అభివృద్ధి కార్పొరేషన్ అమలు చేస్తున్న పథకాల పైన షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సంస్థల ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ నేతృత్వంలో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది.తెలంగాణ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్,రజక ఫెడరేషన్ కార్పొరేషన్ లు అమలుచేస్తున్న పథకాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశంలో కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ,రాష్ట్ర వ్యాప్తంగా 36,526 మంది నాయి బ్రాహ్మణుల మాత్రమే ఉచిత విద్యుత్తు లబ్ధిదారులు ఉండటం పట్ల విస్మయం వ్యక్తం చేశారు.ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్న కానీ సంక్షేమ పథకాలు లబ్దిదారులకు అందడం లేదని అన్నారు.అదేవిధంగా వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.కావున ప్రభుత్వం కేటాయిస్తున్న బడ్జెట్ ను వినియోగించుకొని ప్రజలకు చేరేటట్లు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంలో ఉన్న ఉన్నత అధికారులపై ఉందని తెలిపారు. అందుకు అనుగుణంగా వివిధ పథకాలను ఎలాంటి అవరోధాలు లేకుండా అమలు చేసే బాధ్యత తీసుకోవాలని కోరారు. అందుబాటులో ఉన్న బడ్జెట్ ల్యాప్స్ కావటం జరగకూడదని అన్నారు.అతి త్వరలో బీసీ సంక్షేమ శాఖ అధికారులతో బీసీ ఏ ఉప కులాలతో నియోజకవర్గ స్థాయిలో సమావేశాలు నిర్వహించి వారి ఆర్థిక స్థితిగతులపై నివేదిక తీసుకొని ఆ ఉప కులాలకు ప్రజలకు మేలు జరిగే విధంగా ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని వెల్లడించారు.ఈ సమావేశంలో శాసన సభ్యులు తోట లక్ష్మీకాంత రావు,పట్లోల సంజీవ రెడ్డి,బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మాయాదేవి,బీసీ సంక్షేమ శాఖ చీఫ్ ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ అలోక్ కుమార్,బీసీ ఫైనాన్స్ కమిషన్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్య భట్టు,నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇందిరా,అసెంబ్లీ డిప్యూటీ సెక్రెటరీ రఘుమ రెడ్డి, ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ మాధవి,తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయంలో

# సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా..

### ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
కుత్బుల్లాపూర్ 125 - గాజుల రామారం డివిజన్ కైసర్ నగర్ బస్తీతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయలలో బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పర్యటించారు.ఈ పర్యటనలో భాగంగా కైసర్ నగర్లో నూతనంగా నిర్మించిన రోడ్డును పరిశీలించడంతో పాటు స్థానికంగా నెలకొన్న మురుగునీటి అవుట్ లేట్ సమస్యతో పాటు మంచినీటి సరఫరా లాంటి సమస్యలను స్థానికులు,డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాల లబ్ధిదారులు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కైసర్ నగర్తో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాలలో పర్యటించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ గా మాట్లాడుతూ,ప్రైవేట్ అపార్ట్మెంట్లకు దీటుగా సకల సౌకర్యాలను కల్పిస్తూ నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చిన మహోన్నత నాయకులు బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు.డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాలలోని మౌలిక వసతుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని అందులో భాగంగా ఇప్పటికే సేవరేజ్ మేనేజ్మెంట్ సమస్యతో పాటు వీధి దీపాల నిర్వహణ సమస్యను పరిష్కరించామని, రానున్న రోజుల్లో కూడా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాలలోని సమస్యల పరిష్కారానికి చేస్తానన్నారు. మురుగునీటి అవుట్ లేట్ సమస్యతో పాటు మంచినీటి సమస్య పరిష్కారం కోసం ప్రణాళికలు రూపొందించి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.గతంలో మన బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కైసర్ నగర్ బాచుపల్లి లింక్ రోడ్డును ఏర్పాటు చేయడంతో పాటు కైసర్ నగర్ బస్తిని అభివృద్ధి పరిచామని, అభివృద్ధిలో భాగంగా నేడు కైసర్ నగర్ బస్తీ రోడ్డును నిర్మించి అభివృద్ధి పరిచామని, రానున్న రోజుల్లో కైసర్ నగర్ తో పాటు కుత్బుల్లాపూర్ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ అధికారులు, 2 బిహెచ్కె డిగ్నిటీ హౌసింగ్ సొసైటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సాదుల వేణు,ముఖ్య సలహాదారులు షేక్ సాజిద్ చౌష్, ఎండి.ఆతిక్ రెహ్మాన్, బ్రహ్మనాయుడు, ప్రధాన కార్యదర్శి మోహన్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి సయ్యద్ షఫీ, కోశాధికారి ఎస్.ఏ.ఖయుమ్, స్థానిక నాయకులు పరుశ శ్రీనివాస్ యాదవ్, విజయ్ రాంరెడ్డి,సీనియర్ నాయకులు కస్తూరి బాల్రాజ్,అడ్వకేట్ కమలాకర్, తెలంగాణ సాయి, చెట్ల వెంకటేష్, బోయిని మహేష్, చిన్నా చౌదరి, తారా సింగ్, సాయిబాబా, మామి,అజయ్ గుప్తా,నయీమ్, మసూద్,నవీన్, తురియా నాయక్, కిషోర్ యాదవ్, ఉపేందర్ రెడ్డి, సురేష్,చిన్నా బాబు,నగేష్, చిన్నా,సయ్యద్ రంజాన్,ప్రసాద్, శివా నాయక్, ఆసిఫ్,గౌస్ తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో పంచాయతీ కార్మికుడు మృతి

**వాజేడుఏప్రిల్ 9,(ప్రజావినికిడి):**
గుమ్మడిదొడ్డి గ్రామపంచాయతీ సిబ్బంది గా పనిచేస్తున్న ముడెం రామయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ, బుధవారం ఉదయం 10 గంటలకు మృతి చెందారు,ఇతను గత 12 సంవత్సరాలుగా గుమ్మడిదొడ్డి గ్రామ పంచాయితీలో సిబ్బందిగా సేవలు అందిస్తున్నారు విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ బోదేబోయిన భరత్ కుమార్ తన ఇంటికి వెళ్లి అతని ఆత్మకి శాంతి కలగాలని ఆ దేవుని ప్రార్థిస్తూ సంతాపం తెలియజేయడం జరిగింది వారి కుటుంబ సభ్యులకు తన సానుభూతి తెలిపారు దహనం సంష్కరాలు నిమిత్తం తన వంతుగా 3000 రూపాయలు ఆర్థిక సహాయం చేసారు ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు


మొడెం రామయ్య ఫైల్ పోటో...

# తిమ్మాపూర్ లో ఇందిరమ్మ ఇండ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే





**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి ఇల్లు ఇవ్వడమే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్థానిక కౌన్సిలర్ చంద్రకళ రాజేందర్ గౌడ్ తో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,పేద ప్రజల సొంతింటి కల ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాధ్యమైందని అన్నారు.నిరుపేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవించే విధంగా ప్రభుత్వం అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నదని వారు చెప్పారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్,కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు జాండగూడెం సుదర్శన్ గౌడ్,కౌన్సిలర్స్ కోస్గి శ్రీనివాస్,మాధవి గోపాల్ గౌడ్,మాజీ సర్పంచ్ ఏనుగు జనార్దన్ రెడ్డి,మండల యూత్ అధ్యక్షుడు వన్నాడ శివశంకర్ గౌడ్,నాయకులు శివ కుమార్ గౌడ్, పాశం కృష్ణ,చింత సాయి తేజేశ్వర్,తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభించిన కొలన్ హన్మంత్ రెడ్డి..








**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):** నియోజకవర్గం సుచిత్రలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళ శక్తి క్యాంటీన్ ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు.ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని, ప్రజలకు తక్కువ ధరలకు నాణ్యమైన భోజనం అందించాలనే ఉద్దేశంతో ఈ క్యాంటీన్‌ను ప్రారంభించామని తెలిపారు.ఈ క్యాంటీన్‌ను హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొంటూ, మహిళా సాధికారత దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని, మహిళా స్వయం ఉపాధికి తోడ్పాటు అందించడం, ప్రజలకు నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా ఈ క్యాంటీన్ ఏర్పాటు చేయబడింది తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు దమ్మని శ్రవణ్ కుమార్ ముదిరాజ్,బేకు శ్రీనివాస్,లక్ష్మీ చౌదరి,మైసీగారి శ్రీనివాస్,సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, జక్కుల మల్లేష్ యాదవ్,ముత్యం రెడ్డి,బండి శ్రీనివాస్ గౌడ్,రంగయ్య, బాలప్ప,సుజాత యాదవ్,నాగ, రేవతి,మాధురి, కూన చింటూ తదితరులు పాల్గొన్నారు.

## తన పుట్టినరోజు సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ని మర్యాద పూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అంజి ముదిరాజ్.

**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
కుత్బుల్లాపూర్ 129 - సూరారం డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు అంజి ముదిరాజ్ తన పుట్టినరోజు సందర్భంగా కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలువగా బిఆర్ఎస్ ఎల్పి విప్,ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్, సీనియర్ నాయకులు అంజి ముదిరాజ్ ను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి ప్రజాసేవలో మరింత ఉత్సాహంగా ముందుకు సాగాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో విశ్వకర్మ కాలనీ ప్రెసిడెంట్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ ముదిరాజ్, కోల శ్రీకాంత్ ముదిరాజ్,వేణు ముదిరాజ్,చందు, సోనూ ముదిరాజ్, సందీప్,సాయి గౌడ్,తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా సురక్షిత మాతృత్వ దినోత్సవం.

## గర్భిణీ స్త్రీలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సరైన వైద్య సేవలు పొందాలి.. - జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి..





**రంగారెడ్డి,(ప్రజావినికిడి):**
ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మార్చి 6 నుండి 11 వరకు నిర్వహిస్తున్న ఆరోగ్య అవగాహన వారోత్సవాలలో భాగంగా బుధవారం ఆరోగ్య శాఖ,మహిళా మరియు శిశు సంక్షేమ శాఖల అధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో ఏర్పాటు చేసిన సురక్షిత మాతృత్వ దినోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పూర్వకాలంలో శారీరక వ్యాయామం ఉండేదని,కానీ మారుతున్న అలవాట్లకు అనుగుణంగా శారీరక వ్యాయామం తగ్గిందని,దీనికి తోడు మానసిక ఒత్తిడి ప్రతి ఒక్కరిలో పెరగడంతో చిన్న వయస్సులోనే వాధ్యులబారిన పడటం జరుగుచున్నదని అన్నారు.నేటి సమాజంలో సంపద కన్నా ఆరోగ్యమే ముఖ్యమని, ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు.గర్భిణీ స్త్రీలు తగిన జాగ్రత్తలు, సరైన పోషకాహారం తీసుకుంటూ ఆశ వర్కర్ల సహాయంతో మెరుగైన వైద్య సేవలు పొందాలని, ప్రభుత్వ ఆసుపత్రిల లో జరుగుతున్న ప్రసవాలు రంగారెడ్డి జిల్లాలో 57% ఉందని తెలిపారు.ఎక్కువ మొత్తంలో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని,



శిశు మరణాల రేటును పూర్తిగా తగ్గించాలని వైద్య అధికారులకు సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఒక మహిళకు గర్భ నిర్ధారణ అయిన నాటి నుండి ప్రసవం అయ్యే వరకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందన్నారు.అదేవిధంగా రాష్ట్ర,జిల్లాలోనే కాకుండా గ్రామీణ ప్రాంతాలతో కూడా ప్రబలుతున్న డ్రగ్స్ సంస్కృతిని గురించి గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలకు, ఏఎన్ఎంలకు సూచించారు.
అనంతరం ఎలిమినేడు గ్రామ ప్రాథమిక కేంద్రంలో హెచ్ పి వి వ్యాక్సిన్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి వాక్సిన్ వేసుకున్న వారికి సర్టిఫికేట్ అందచేశారు.ఈ వ్యాక్సిన్ వల్ల మహిళల్లో సాధారణంగా వచ్చే గర్భాశయ ముఖ క్యాన్సర్ నుండి నివారించడానికి వాడతారని తెలిపారు హెచ్ పి వి అనే వైరస్ వల్ల వచ్చే ఇతర క్యాన్సర్లను తగ్గిస్తుందని తెలిపారు. ముఖ్యంగా మహిళలు ఆరోగ్యాన్ని రక్షిస్తుందని,9 నుండి 14 సంవత్సరాల బాలికలకు అత్యంత మంచిదని తెలిపారు.ఈ టీకా పూర్తిగా సురక్షితమైనదని, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆమోదించినదని, జిల్లా వైద్యం మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా ఈ వ్యాక్సిన్ అందుబాటులో ఉందని తల్లిదండ్రులు విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.
జిల్లాలో జరుగుతున్న ప్రసూతి సేవలు అలాగే ప్రసవానంతర సేవలు సంపూర్ణంగా అందిస్తున్నామని,జిల్లాలో మాతృ మరణాలు సంఖ్య గణనీయంగా తగ్గిందని ,హెచ్ పి వి హ్యూమన్ పాపిలోమా వైరస్ అనే వ్యాక్సిన్ రంగారెడ్డి జిల్లాలో 22 సెంటర్లలో ప్రారంభించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రంగారెడ్డి జిల్లా డాక్టర్ లలితా దేవి తెలిపారు.
ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,పిడి డి ఆర్ డి ఓ మరియు సీడీపీఓ శ్రీలత,ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రాధిక డాక్టర్ పూనం,డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీప్రసన్న,వైద్యాధికారులు డాక్టర్ మోహన్,డాక్టర్ రాజలక్ష్మి డాక్టర్,సంతోషి,డెమో శ్రీనివాసులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఐదు రాష్ట్రాల ఎన్నికల తరవాత ఫోకస్

### ప్రధాని మోడీ ఏం ఆలోచిస్తారో ఎవ్వరికీ తెలియదు

### నితిన్ నబీని అధ్యక్షుడిని చేస్తారని ఎవ్వరూ ఊహించలేదు

### మీడియాతో బిజెపి ఎంపి లక్ష్మణ్ సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్,ఏప్రిల్ 8 (ప్రజావినికిడి):**
ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలంగాణపై ఫోకస్ చేస్తామని బీజేపీ రాజ్యసభ సభ్యుడు కె. లక్ష్మణ్ స్పష్టం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి అనుకూలంగా ఉన్నా.. రేవంత్ వైపు గాలి వీచిందని తెలిపారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎంపీ లక్ష్మణ్ విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ప్రధాని మోదీ ఏం ఆలోచిస్తారో రెండో వ్యక్తికి కూడా తెలియదన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా నితీన్ నబీన్‌ను ఎంపిక చేస్తారని ఎవ్వరూ ఊహించలేదని తెలిపారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ నిలబడడం అంతా ఈజీ కాదని చెప్పారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అడిగే ప్రశ్నలకు ఎవ్వరూ సమాధానం చెప్పడం లేదన్నారు. అయితే కవిత ప్రస్తుతం ప్రస్తావిస్తున్న అంశాలు.. ఆమె బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడే మాట్లాడి ఉంటే బాగుండేదని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. దేశ రాజధాని ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుస్తుందని ఎవరూ ఊహించలేదన్నారు. తెలంగాణ ప్రజలు తెలివైన వారని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 8 సీట్లు వచ్చినా.. 38 శాతం ఓట్లు ప్రజలు ఇచ్చారని ఎంపీ లక్ష్మణ్ వివరించారు. వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీదే పైచేయి అవుతుందని ఈ సందర్భంగా ఆయన జోస్యం చెప్పారు. ఒక ఎన్నిక తీసుకుని ఎప్పుడూ అంచనా వేయడం తప్పు అని అభిప్రాయపడ్డారు. మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లు తరువాత.. మొత్తం వన్ సైడేనని అన్నారు. ఇప్పటికే మహిళా బిల్లును ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయనే విషయం ప్రజల్లోకి వెళ్లిందని తెలిపారు. బట్ట కాల్చి మీద వేస్తే.. ప్రజలు అంత అమాయకులు కాదన్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పార్టీ పెట్టుకోవచ్చునని చెప్పారు. తమిళనాడులో టీవీకే పార్టీ అధినేత విజయ్ సమావేశాలకు
ప్రజలు భారీగా వస్తున్నారని.. కానీ ఆ పార్టీ జస్ట్ 5 లేదా 6 సీట్ల కంటే ఎక్కువ గెలవదన్నారు. తెలంగాణలో హేట్ స్పీచ్ బిల్లు తెచ్చి పకడ్బందీగా అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి గతంలో ప్రకటించారని ఎంపీ లక్ష్మణ్ గుర్తు చేశారు. ముస్లింలను రెచ్చగొట్టే వ్యాఖ్యలపై సీఎం రేవంత్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇది హేట్ స్పీచ్ కాదా? అని సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు.


# కాలుష్య కాసారంగా బంజారా లేక్

## ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో కలసి పరిశీలన -చెరువు రక్షణకు చర్యలు తీసుకుంటామన్న రంగనాథ్

**హైదరాబాద్,ఏప్రిల్ 8 (ప్రజావినికిడి):**
బంజారాహిల్స్‌లో ఉన్న బంజారా లేక్ ను హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తాజ్ బంజారా ముందున్న చెరువు తీవ్ర కాలుష్యంతో దుర్గంధభరితంగా మారిందంటూ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన కమిషనర్ రంగనాథ్ బుధవారం ఎమ్మెల్యే దానం నాగేందర్ తో కలిసి బంజారా లేక్ ను పరిశీలించారు. చెరువులోకి మురుగు నీరు, ఎ÷-లాస్టిక్ వ్యర్థాలు చేరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు రంగనాథ్. ఒకప్పుడు మంచినీటి సరస్సుగా బంజారా లేక్ ఇప్పుడు అత్యంత కలుషిత జలవనరుగా మారిందని అన్నారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో రహదారి నిర్మాణం, చెరువు ఉనికికే ముప్పు తెచ్చిందని అన్నారు. కట్టమైసమ్మ ఆలయానికి వెళ్లే మార్గం ఆక్రమణపై భక్తుల నుంచి ఫిర్యాదులు వచ్చాయని.. ప్రభుత్వ భూమిని కాపాడుతూ చెరువు పునరుద్ధరణకు సమగ్ర నివేదిక సిద్ధం చేస్తామన్నారు కమిషనర్ రంగనాథ్. నివాసాలను ప్రభావితం చేయకుండా చెరువు రక్షణ చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. నాలాలు మూసివేసే నిర్మాణాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు రంగనాథ్. అనంతరం శంషాబాద్ లోని మామిడిపల్లిలో నాలుగైదు చెరువులు



మాయమయ్యాయన్న ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు రంగనాథ్. ఒంగోని కుంట, కనకయ్య కుంట, మద్రివాణి కుంట, ఎర్రకుంట ఆక్రమణలపై సీరియస్ అయ్యారు రంగనాథ్. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల నుంచి పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేశారు. వరద కాలువలు ఆక్రమణలతో మూసివేతకు గురై వర్షాకాలంలో నీటిమునిగే ప్రమాదం ఉందని..ఆక్రమణదారులతో సమావేశమయ్యి స్వచ్ఛందంగా తొలగించకపోతే హైడ్రా చర్యలు తప్పవని హెచ్చరించారు. చెరువులు, కాలువలపై పూర్తి స్థాయి డేటా సేకరణకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు రంగనాథ్.



## తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసిన కూన శ్రీశైలంగౌడ్



**కుత్బుల్లాపూర్, (ప్రజావినికిడి):**
కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ గాంధీభవన్లో తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఇటీవల ప్రకటించిన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కమిటీ మరియు త్వరలో ప్రకటించబోయే డివిజన్ కమిటీలపై వారు చర్చించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై తీసుకోవలసిన అంశాలపై మహేష్ కుమార్ గౌడ్ పలు సలహాలు సూచనలు చేశారు.అదేవిధంగా రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిచే విధంగా కృషి చేయాలని కోరినట్లు మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ తెలిపారు.

# డీసీఎం డ్రైవర్ అదృశ్యం.. కుటుంబ సభ్యుల ఆందోళన

**నాగోల్,(ప్రజావినికిడి):**
డీసీఎం వాహనంతో పుచ్చకాయలు అమ్మేందుకు వచ్చి డ్రైవర్ అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. నాగోల్ పోలీస్ స్టేషన్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ అందించిన వివరాల ప్రకారంకామారెడ్డి జిల్లా లింగపేట్ మండలం మంగరం గ్రామానికి చెందిన కొమ్ముల రవి యాదవ్ (37), తండ్రి మల్లయ్య, వృత్తి డ్రైవర్. జీవనోపాధి కోసం డీసీఎం వాహనంలో పుచ్చకాయలు తీసుకుని తన గ్రామస్తులతో కలిసి ఈ నెల 3వ తేదీన నాగోల్ ప్రాంతానికి వచ్చాడు.



ఆల్కాపురి ఎక్స్ రోడ్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో డీసీఎంను నిలిపి పుచ్చకాయల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అయితే ఈ నెల 6వ తేదీన అక్కడి నుండి వెళ్లిన రవి యాదవ్ తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. అతను ఎక్కడికి వెళ్లాడో ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లభించలేదు.ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో నాగోల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.రవి యాదవ్ గురించి ఎవరికి అయినా సమాచారం తెలిసిన పక్షంలో సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని అధికారులు కోరుతున్నారు.

# జలవిహార్‌లో ఆర్వో ప్లాంట్ పేలుడు

### ఇద్దరికి గాయాలు...ఆస్పత్రికి తరలింపు



**హైదరాబాద్,ఏప్రిల్ 8 (ప్రజావినికిడి):**జలవిహార్ లో ఆర్వో ప్లాంట్‌పేలుడు ఘటన కలకలం రేపింది. నీటిని సరఫరా చేసే ఆర్వో ఎ÷-లాంట్ ఒక్కసారిగా బ్లాస్ట్ అవ్వడంతో భయాందోళనకు గురయ్యారు సందర్శకులు. బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. జలవిహార్ కు నీటిని సరఫరా చేసే ఆర్వో ప్లాంట్ పేలింది. ఈ ఘటనలో ప్లాంట్ దగ్గర పనిచేస్తున్న ఇద్దరు సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. పేలుడు ధాటికి ఆర్వో ప్లాంట్ పరికరాలన్నీ తునాతునకలు అయ్యాయి. ఆర్వో ఫిల్టర్ లేదా కంప్రెషర్ లో అధిక ప్రెషర్ ఏర్పడడమే పేలుడుకు కారణమని భావిస్తున్నారు పోలీసులు. గాయపడిన ఇద్దరినీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడ్డ ఇద్దరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.సమ్మర్ కావడంతో జలవిహార్ కు సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటోంది... ఇలాంటి సమయంలో ప్రమాదం జరగడం పట్ల సందర్శకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే..ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు పోలీసులు.

## తెలంగాణ భవన్ ముట్టడికి ఉద్యమకారుల జెఏసి యత్నం అడ్డుకున్న పోలీసుల..స్వల్ప ఉద్రిక్తత

**హైదరాబాద్,ఏప్రిల్ 8 (ప్రజావినికిడి):** తెలంగాణ భవన్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ సభ్యులు ముట్టడించారు. తమ సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ వారు ఆందోళనకు దిగారు. పలువురు ఉద్యమకారులు తెలంగాణ భవన్ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో అదనపు బలగాలను అక్కడికి తరలించారు పోలీసులు. పోలీసుల తీరుపై ఉద్యమకారుల జేఏసీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యమకారులను బీఆర్ఎస్ పార్టీ పట్టించుకోవడం లేదని వారు విమర్శించారు. ఉద్యమకారుల సమస్యలపై ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ ఎందుకు ప్రశ్నించడం లేదంటూ తెలంగాణ భవన్ వద్ద ఉద్యమకారుల జేఏసీ సభ్యులు ఆందోళన చేశారు. ఉద్యమకారుల ఆందోళనతో తెలంగాణ భవన్ వద్ద టెన్షన్ వాతావరణం నెలకొంది.

# ప్రపంచాన్ని బలి చేసిన ట్రంప్ యుద్ధోన్మాదం!

**ఏప్రిల్ 8 (ప్రజావినికిడి):**
అమెరికా-ఇజ్రాయిల్ చేసిన యుద్ధంతో సాధించిందేమిటి? ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలను కుదేలు చేసిన ఈ ఇరు దేశాల నేతలు ఇప్పుడు చిద్విలాసంగానే ఉన్నారు. ఇరాన్‌ను సర్వనాశనం చేయాలని చూసి చేతులు కాల్చుకున్నారు. కానీ ప్రపంచ దేశాలు ఆయిల్, గ్యాస్ దొరక్క విలవిల్లాడాయి. ధరలు పెరిగాయి. విమానాలు రద్దయ్యాయి. ఎక్కడికి పోవాలన్నా విమాన ధరలు అందనంతగా పెరిగాయి. ఇంత విధ్వంసం చేసిన ట్రంప్ ..ఇప్పుడు తాత్కాలికంగా రెండు వారాలు యుద్ధాన్ని వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు. నిజానికి శాశ్వతంగా యుద్ధాన్ని ఆపేసి, ఇరాన్ సహా నష్టపోయిన దేశాల పునర్నిర్మాణంలో పాల్గొనాలి. ఇరాన్ అధినేత ఖమేనీని అంతమొందించి, ఇరాన్‌పై బాంబు దాడులు చేసి సాధించింది మాత్రం శూన్యం. ఓ రకంగా చెప్పాలంటే ఈ యుద్ధంలో ట్రంప్ ప్రథమ దోషి. తరవాతి స్థానం నెతన్యాహూది. వీరి యుద్ధ కాంక్షకు, నిరంకుశ వైఖరికి ప్రపంచ దేశాలు అల్లాడాయి. బాంబు దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ హార్ముజ్ జలసంధిని మూసివేసింది. దాంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలమైపోతోంది. చమురు ధరలు పెరిగాయి. చమురు అందకుండా పోయింది. నౌకలు ఎక్కడికక్కడే నిలిచి పోయాయి. డాలర్ల లెక్కలో ముడిచమురు ధరలు పెరిగిపోయాయి. దాని వెనువెంటనే ఇతర దేశాల కరెన్సీల, ముఖ్యంగా ఆసియా దేశాల కరెన్సీల



విలువలు పడిపోవడం మొదలైంది. దీని ఫలితంగా సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో కన్నా ఎక్కువ మోతాదులో మూడవ ప్రపంచ దేశాలలో ద్రవ్యోల్బణం పెరిగిపోతోంది. ఇలా ద్రవ్యోల్బణం పెరిగిపోవడం వలన ప్రజల కొనుగోలు శక్తి హరించుకుపోతోంది. అందువలన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆర్థికమాంద్య ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. చమురుకు కొరత ఏర్పడినందువలన ఎరువుల ఉత్పత్తి తగ్గిపోయింది. దాంతో ఆ ఎరువుల కొరత ఏర్పడింది. దాని ఫలితంగా ఆహారధాన్యాల ఉత్పత్తి దెబ్బ తింటోంది. ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాలలో దుర్భర పరిస్థితుల మధ్య శ్రామిక ప్రజానీకం చిక్కుకుపోతున్నారు. ఇలా ట్రంప్ సాధించిన ఘనతలకు ఇవన్నీ నిదర్శనాలుగా చెప్పుకోవాలి. ఈ సంక్షోభానికి దారి తీసిన చట్టవిరుద్ధమైన, అనైతికమైన యుద్ధానికి ముగింపు తాత్కాలికం కారాదు. శాశ్వతంగా యుద్ధాన్ని ముగించేందుకు బేషరతుగా ట్రంప్ అడుగులు వేయాలి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చమురు చాలా చిన్న విషయమే అయినా, చమురు ధరల పెరుగుదల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇంత స్థాయిలో ప్రభావం చూపడం చూస్తున్నాం. ఎందుకంటే చమురు చుట్టే అన్నీ పెనవేసుకుని ఉన్నాయి. సామ్రాజ్యవాద విస్తరణ, ఆక్రమణ యత్నాలకు ప్రధాన కారణం ముడిపదార్థాల మీద అదుపు సంపాదిం చడమేనని ఇప్పుడు వేరుగా చెప్పాల్సిన పనిలేదు. వెనెజువెలా తరవాత ఇరాన్‌పై దాడి సులభంగా అవుతుందనుకున్న ట్రంప్‌కు ఇదొక పెద్ద షాక్. ఇకముందు ప్రపంచ దేశాలపై దాడులు చేస్తే ఆయా దేశాలు ఎదురుదాడికి సిద్ధంగా ఉంటాయని ట్రంప్ బుద్ధి తెచ్చుకోవాలి. ప్రస్తుత పరిణామాలు ఈ విషయాన్నే బలపరుస్తున్నాయి. ప్రపంచ చమురు ఉత్పత్తుల్లో-ముడి చమురు మాత్రమే కాక దాని నుంచి వచ్చే వివిధ ఉత్పత్తులన్నీ కలుపుకుని-20 శాతం మాత్రమే హార్ముజ్ జల సంధి ద్వారా రవాణా అవుతుంది. రవాణాకు ఆటంకం ఏర్పడింది. ఇంత చిన్న విషయానికే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇంత పెద్ద స్థాయిలో సంక్షోభం తలెత్తిందంటే చమురు వంటి ముడిసరుకు ఎటువంటి కీలక పాత్ర పోషిస్తోందో బోధపడుతోంది. అంత కీలకమైన పాత్ర పోషించగలగడానికి కారణం చమురు విశ్వవ్యాప్త వాణిజ్య వస్తువు కావడమే అని గుర్తించాలి. అది ఆర్థిక ఇబ్బందులను సృష్టించగలిగే అవకాశం ఎక్కువగా కలిగి ఉంది. దాని ధర పెరగడం వలన కలిగే ద్రవ్యోల్బణ ప్రభావం అంతే తీవ్రంగా ఉంటుంది. ముడి చమురు ధరలో 10 శాతం పెరుగుదల ఉంటే కలిగే ప్రభావం తక్కువగా ఉంటుంది. ముడిచమురు ధరలో వచ్చే మార్పు ఆర్థిక వ్యవస్థ మీద ఇంతటి తీవ్ర ప్రభావాన్ని కలిగించగలదని ఈ నెల రోజుల్లో మనకు అనుభవంలోకి వచ్చింది. డాలర్ విలువ ముడిచమురు విలువతో ముడిపడిపోయి వుంది. అందుకే డాలర్ ఆధిపత్యం కొనసాగేందుకు అమెరికా డాలర్లను ముద్రించి విడుదల చేస్తోంది. ఆ డాలర్లను స్వీకరించడానికి, వాటి విలువను అంగీకరించడానికి ప్రపంచం కూడా సుముఖంగానే ఉంది. అందుచేత ఇప్పుడు ప్రపంచం అంతా డాలర్లు ఎక్కడబడితే అక్కడ ఉన్నాయి. ఈ పరిస్థితిలో డాలర్ ప్రమాణం ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి దాపురిస్తే మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచ స్థిరత్వమే ప్రమాదంలో పడుతుంది. అందుచేత చమురు-డాలర్ ప్రమాణాన్ని నిలబెట్టుకోవడం మరింత కీలకంగా మారింది. అలా నిలబెట్టుకోడానికే చమురును ఉత్పత్తి చేసే దేశాల మీద రాజకీయ ఆధిపత్యాన్ని చెలాయించడానికి అమెరికా పూనుకుంటోంది. అందుకే దాడులకు తెగిస్తోంది. ముడి చమురుపై పెత్తనం కోసం చేస్తున్న యుద్ధంగా దీనిని యూడాలి. ఇరాన్‌లో ప్రభుత్వాన్ని గద్దె దించేసి తన తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలనన్న ధీమాతో అమెరికా ఇరాన్ మీద దాడికి దిగింది. అయతుల్లా ఆలీ ఖమేనీతో సహా ఇరాన్ ఉన్నతాధికారులను అంతం చేసి,ఇరాన్‌ను తన చెప్పుచేతల్లోకి తెచ్చుకోవాలని, అందుకు ఇజ్రాయిల్‌ను వాడుకోవాలని అమెరికా చూసింది. తన డాలర్ సర్వాధిపత్యాన్ని మరింత బలపరుచుకోవాలన్న ఉద్దేశంతో అమెరికా చేసిన ఈ ప్రయత్నం బెడిసి కొట్టిందనే చెప్పాలి. అయితే ప్రపంచం మాత్రం మూల్యం చెల్లించుకుంది. ఇప్పటికైనా ట్రంప్ కళ్లు తెరవాలి. యుద్ధోన్మాదం నుంచి బయటపడాలి.

## తాగుబోతు ర్యాష్ డ్రైవింగ్‌కు ముగ్గురు బలి

### ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు..మరో యువకుడు మృతి

**హైదరాబాద్,ఏప్రిల్ 8 (ప్రజావినికిడి):**
ఓ తాగుబోతు డ్రైవర్ సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. మూడు కుటుంబాల్లో కడుపుకోత పెట్టాడు. ముగ్గురు యువకులు దర్మరణం చెందారు. భవిష్యత్‌పై ఎంతో కలలతో ఇంజనీరింగ్‌లో అడుగుపెట్టిన ఇద్దరు విద్యార్థులు అసువులు బాసారు. వివరాల్లోకి వెళితే.. సాగర్ రోడ్డు హస్తినాపురం వద్ద బుధవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మద్యం మత్తులో కారు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ఓ వ్యక్తి.. ద్విచక్ర వాహనాన్ని, నడిచి వెళ్తున్న మరో యువకుడిని ఢీకొట్టాడు. వీరిని వంద మీటర్ల



వరకు ఈడ్చుకెళ్లి కారు పల్టీ కొట్టింది. ఘటనలో ద్విచక్రవాహంపై వెళ్తున్న మహవీర్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు శివ, సందీప్ మృతి చెందారు. రోడ్డుపై నడిచివెళ్తున్న మరో యువకుడు కూడా మృతి చెందాడు. దీంతో కారు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కళాశాల విద్యార్థులు ఆందోళనకు దిగారు. డ్రైవర్‌ను తమకు అప్పగించాలని విద్యార్థులు నినాదాలు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. భారీగా పోలీసులు మోవరించడంతో పోలీసులకు విద్యార్థులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ప్రమాదం చేసిన వ్యక్తిని తమకు అప్పగించాలని విద్యార్థులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. ప్రమాదానికి కారణమైన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌పై దుండగుల రాళ్లదాడి

### గస్తీ పోలీసులు రావడంతో ముఠా పరార్ -ముఠాలో పోలీసులకు చిక్కిన ఇద్దరు మహిళలు

**హైదరాబాద్,ఏప్రిల్ 8 (ప్రజావినికిడి):**
ఒడిశా, బిహార్ రాష్ట్రాల తరహాలో తెలంగాణలోనూ రైలుపై దాడి జరగడం కలకలం రేపింది. తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ లక్ష్యంగా దుండగులు రాళ్లతో దాడికి తెగబడ్డారు. గస్తీలో ఉన్న పోలీసులు అప్రమత్తమవ్వడంతో దుండుగులు పారిపోయారు. ఈ క్రమంలో వారిని పట్టుకునేందుకు సినీఫక్కీలో పోలీసులు చేజింగ్ చేశారు. కానీ 30 మంది గ్యాంగ్ తప్పించుకుని వెళ్లింది. అయితే గ్యాంగ్‌లోని ఇద్దరు మహిళలు మాత్రం పట్టుబడ్డారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతి బయల్దేరిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ గతరాత్రి తిమ్మాపూర్ పోలీస్ స్టేషన్ దాటుతున్న సమయంలో ట్రాక్ పక్కన 30 మంది గ్యాంగ్ మాటు వేసి ఒక్కసారిగా రాళ్ల వర్షం కురిపించింది. కిటికీలు, బోగీలకు రాళ్లు తగలడంతో ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. సరిగ్గా అదే సమయంలో గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు ఆ గుంపును గమనించి అడ్డుకునే ప్రయత్నం చేశారు. గ్యాంగ్‌ను పట్టుకునేందుకు పోలీసులు యత్నించగా.. సుమారు




30 మంది గుంపు పోలీసులనే రౌండప్ చేసి దాడికి యత్నించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అదనపు బలగాల సాయం కోరారు. దీంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. ఈ క్రమంలో వారిని కిలోమీటర్ల మేర ఛేజ్ చేశారు. కానీ నందిగామ మండలంలోని పాత జాతీయ రహదారి పక్కనే ఉన్న ఎన్‌సీఎల్ వెంచర్ గుండా పరుగులు తీసి చీకట్లో తప్పించుకున్నారు. కానీ ఇద్దరు మహిళలు మాత్రం పోలీసులకు చిక్కారు. వారిని బిహార్, ఒడిశా, రాజస్థాన్‌కు చెందిన ముఠాలుగా పోలీసులు అనుమానిస్తున్నారు. అరెస్టయిన ఆ ఇద్దరు మహిళలను విచారించగా, తాము రుద్రాక్ష మాలలు అమ్ముకోవడానికి వచ్చామని చెబుతున్నారు. అయితే, అర్ధరాత్రి వేళ రైలుపై దాడికి గల కారణాలపై వారు సరైన వివరణ ఇవ్వడం లేదని, వారి వేషధారణ, ప్రవర్తనపై పోలీసులు తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వీరంతా పక్కా ప్రణాళికతోనే రైళ్లను లక్ష్యంగా చేసుకున్నారా? అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. పరారైన ఆ 30 మంది గుంపు కోసం పోలీసులు రాత్రంతా వెంచర్లలో గాలింపు చర్యలు చేపట్టారు. రాజస్థానీ వేషధారణలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. నందిగామ, తిమ్మాపూర్ పరిసర గ్రామాల్లోని ప్రజలు అపరిచితులకు ఆశ్రయం ఇవ్వకూడదన్నారు రైల్వే ట్రాక్‌ల సమీపంలో అనుమానిత కదలికలు ఉంటే డయల్ 100 కి కాల్ చేయాలని కోరారు. ప్రస్తుతం పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు ముమ్మరం చేశారని, ఈ ముఠా వెనుక ఏదైనా పెద్ద కుట్ర ఉందా లేదా వీరు దొంగతనాల కోసం ఇలా చేస్తున్నారా అనేది తేలాల్సి ఉంది.

## పైలట్ శిక్షణకు వచ్చిన యువతిపై అత్యాచారం

### యువతిపై ట్రైనీ ఇన్‌స్టక్టర్ పలుమార్లు అఘాయిత్యం -ఫిర్యాదుతో నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

**హైదరాబాద్,ఏప్రిల్ 8 (ప్రజావినికిడి):**
బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. ఏవికన్స్ పైలెట్ శిక్షణ సంస్థలో శిక్షణ తీసుకుంటున్న యువతిపై ట్రైనీ ఇన్ స్పెక్టర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. అదే సంస్థలో శిక్షణ ఇన్స్పెక్టర్ గా పని చేస్తున్న కేరళకు చెందిన నసిముద్దీన్ యువతిపై అత్యాచారానికి పాల్పడ్డాడు . ఈ కేసులో నసీముద్దీన్ కు సహకరించిన దమ్మాయిగూడ కు చెందిన మరొక శిక్షణ ఇచ్చే ఇన్స్పెక్టర్ సల్మాన్. యువతి పై అత్యాచారం జరిపి వీడియోలు ఫోటోలు తీసుకుని పలుమార్లు బెదిరింపులకు పాల్పడ్డాడు



నసీముద్దీన్. ట్రైనింగ్ కోసం వచ్చిన యువతిని మాయ మాటలతో లొంగ దీసుకున్న ట్రైనర్ నసిముద్దీన్. పలు మార్లు వేధింపులకు పాల్పడడంతో యువతి ట్రైనింగ్ ఆపేసింది. 2025 అత్యాచారం జరిగిన ప్రాంతం బేగంపేట పరిధిలో ఉండడం తో బేగంపేట పోలిస్ లకు ఫిర్యాదు చేసింది. జనవరి 2025 నుండి పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డట్లు ఫిర్యాదులో బాధితురాలు పేర్కొన్నది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన బేగంపేట పోలీసులు నసీముద్దీన్ ను అరెస్టు చేసినట్లు తెలిపారు.

## ఇరాన్ నుంచి సురక్షితంగా వీడండి

### భారత ప్రజలకు కేంద్రం అడ్వయిజరీ

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 8 (ప్రజావినికిడి):**
ఇరాన్‌లోని భారత పౌరులకు కేంద్రం మరోసారి అడ్వైజరీ జారీ చేసింది. వెంటనే ఆ దేశం నుంచి బయటపడాలని సూచించింది. ప్రస్తుత పరిణామాల దృష్ట్యా ఇరాన్‌లోని ఇండియన్ ఎంబసీ బుధవారం ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టింది. రాయబార కార్యాలయాన్ని ముందుగా సంప్రదించకుండా.. ఏ అంతర్జాతీయ సరిహద్దు సమీపంలోకి రావొద్దని పౌరులను హెచ్చరించింది. అలాగే కొన్ని హెల్ప్‌లైన్ నంబర్లను షేర్ చేసింది. ఇరాన్-అమెరికా (ఎసజీని-జాం) రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఈ సూచనలు జారీ కావడం గమనార్హం. నిన్న రాత్రి కూడా కేంద్ర విదేశాంగశాఖ అడ్వైజరీ జారీ చేసింది. అనవసర ప్రయాణాలు మానుకోవాలని సూచించింది. ఇళ్లల్లోనే ఉండాలని, అన్ని విద్యుత్, సైనిక స్థావరాలు, బహుళ అంతస్తుల భవనాలకు దూరంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం యుద్ధం తాత్కాలికంగా ఆగడంతో స్వదేశానికి రావాలనుకునేవారికి ఇదొక అవకాశంగా మారింది. ఇరాన్‌లో ఉన్న భారతీయులకు ఇరాన్‌లోని ఇండియన్ ఎంబసీ బుధవారం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇరాన్‌లో ఉన్న భారతీయులు వెంటనే దేశం విడిచి వెళ్లిపోవాలని స్పష్టం చేసింది. అవసరమైతే భారత రాయబార కార్యాలయం సహాయం తీసుకోవాలని తెలిపింది. తాము సూచించిన మార్గాల్లో మాత్రమే దేశాన్ని వీడాలని ఎంబసీ ఆదేశించింది. ఎంబసీని సంప్రదించకుండా.. పర్మిషన్ తీసుకోకుండా అంతర్జాతీయ సరిహద్దుల వద్దకు వెళ్లరాదని హెచ్చరించింది. ఈ మేరకు ఎంబసీ బుధవారం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టింది.

## కాల్పుల విరమణతో ప్రపంచ శాంతి

### ఇదో గొప్ప సుదినమంటూ ట్రంప్ పోస్ట్

**వాషింగ్టన్ఏప్రిల్ 8 (ప్రజావినికిడి):**
ఇరాన్‌తో కాల్పుల విరమణపై అమెరికా డీల్ కుదుర్చుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ట్రంప్ తన ట్రుత్ సోషల్‌లో ప్రకటన చేశారు. ప్రపంచ శాంతికి ఇది గొప్ప దినం అన్నారు. ఇరాన్ ఇదే కోరుకుంటోందన్నారు. తాజా వార్‌లో ఇరాన్ చాలా దెబ్బతిన్నట్లు చెప్పారు. హోర్ముజ్ జలసంధిలో మళ్లీ చమురు నౌకల సందడి పెరుగుతుందని, దీనికి అమెరికా సహకరిస్తుందన్నారు. చాలా పాజిటివ్ యాక్షన్ ఉండబోతుందన్నారు. పెద్ద మొత్తంలో డబ్బులు సంపాదిస్తారని, ఇరాన్ మళ్లీ పునర్ నిర్మాణ పనలు మొదలుపెడుతుందన్నారు. ఇక రాబోయే రోజుల్లో పశ్చిమాసియాలో స్వర్ణ యుగం ఉండబోతుందన్నారు. తనకు నమ్మకం ఉందన్నారు. రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందాన్ని విక్టరీగా చెప్పుకున్నారు. ఇరాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇండోనేషియా స్వాగతించింది. ఇరు దేశాలు సార్వభౌమత్వాన్ని గౌరవించాలని పేర్కొన్నది. దౌత్యం ద్వారా సమస్యను పరిష్కరించుకోవచ్చు అని ఇండోనేషియా విదేశాంగ శాఖ ప్రతినిధి యెన్నె మివాంగ్‌కాంగ్ తెలిపారు.

## యుద్ధ విరమణతో మార్కెట్లకు జోష్

### భారీ లాభాల్లో ప్రారంభం అయిన దేశీయ సూచీలు

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 8 (ప్రజావినికిడి):**
ఇరాన్‌పై రెండు వారాల పాటు దాడులు చేయబోమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం అంతర్జాతీయ మార్కెట్లలో ఫుల్ జోష్ తీసుకొచ్చింది. మరోవైపు అంతర్జాతీయంగా చమురు ధరలు కూడా భారీగా దిగి వచ్చాయి. ఈ నేపథ్యంలో దేశీయ సూచీలు కూడా భారీ లాభాలతో ప్రారంభమయ్యాయి. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ బలపడింది. సెన్సెక్స్, నిఫ్టీ మూడు శాతానికి పైగా




లాభంతో ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం దాదాపు అన్ని రంగాలూ లాభాల్లోనే కదలాడుతున్నాయి. గత సెషన్ ముగింపు (74,616)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 2500 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ జోరు కొనసాగుతోంది. చాలా రోజుల తర్వాత 77 వేల మార్క్ దాటింది. ప్రస్తుతం ఉదయం 10:00 గంటల సమయంలో సెన్సెక్స్ 2670 పాయింట్ల లాభంతో 77,286 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా లాభాల బాటలోనే సాగుతోంది. ప్రస్తుతం 777 పాయింట్ల నష్టంతో 23,900 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్, నిఫ్టీలో అశోక్ లేలాండ్, ప్రెస్టీజ్ ఎస్టేట్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, మదర్సన్, ఎల్ అండ్ టీ ÷నాన్స్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి . ఆయిల్ ఇండియా, నాల్కో, ఓఎన్‌జీసీ, కోల్ ఇండియా, సన్ ఫార్మ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 1843 పాయింట్ల లాభంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 2473 పాయింట్ల లాభంతో ఉంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 92.55గా ఉంది.

# బుమ్రానే వణికించిన వైభవ్ సూర్యవంశీ

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో నిన్న రాత్రి జరిగిన రాజస్థాన్ రాయల్స్, ముంబై ఇండియన్స్ మ్యాచ్‌లో యువకెరటాలు సంచలనం సృష్టించారు. రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్ విధ్వంసకర బ్యాటింగ్ చేశారు. సీనియర్ పేసర్లకు కూడా ఎలాంటి గౌరవం లేకుండా బౌండరీలు బాదేస్తూ అందర్ని ఆశ్చర్యానికి గురిచేశారు. తొలుత వర్షం కారణంగా నిన్న ఐపీఎల్‌లో రాజస్థాన్, ముంబై మధ్య జరిగిన మ్యాచ్‌ను 11 ఓవర్లకు అంపైర్లు కుదించారు. ఈ మ్యాచ్‌లో 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ.. విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. ఇప్పుడు అతడి ప్రదర్శనపై తెగ చర్చ జరుగుతోంది. టీమ్ఇండియా పేసర్ జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లోనూ తొలి బంతికే వైభవ్ అవలీలగా సిక్సర్‌గా మరల్చడం పట్ల అందరి దృష్టిని ఆకర్షించాడు. తొలి బంతికే సిక్సర్ కొట్టిన విధానం ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. గౌహతి స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో జస్ప్రీత్ బుమ్రా, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మధ్య హోరాహోరీ పోరు జరిగింది. బుమ్రా వేసిన తన మొదటి బంతిని ఎదుర్కొన్న సూర్యవంశీ ఏమాత్రం సంకోచించలేదు. అతను



ఆరంభంలోనే ఒక స్లాట్ డెలివరీని అంచనా వేసి, దానిని లాంగ్-ఆన్ మీదుగా సిక్సర్‌గా మరల్చాడు. క్షణాల్లోనే ఆ క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. టీమ్ఇండియా పేసర్ బుమ్రా ఏమాత్రం కనికరం లేకుండా ఆడిన తొలి ఇన్నింగ్స్ ఇదే అని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. వైభవ్ సూర్యవంశీ ప్రదర్శన రాజస్థాన్ రాయల్స్ జట్టు గెలుపులో కీలకంగా మారింది. రాజస్థాన్ ఓపెనర్లు యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ రన్‌రేట్‌ను భారీగా పెంచడంతో ఇద్దరూ కృషి చేశారు. అయితే బుమ్రా బౌలింగ్‌లో ఏకంగా రెండు సిక్సర్లు బాది సూర్యవంశీ ఆటతో అందర్ని ఆకట్టుకున్నాడు. ఆ విధంగా బుమ్రా బౌలింగ్‌లో ఒకే ఓవర్‌లో ఏకంగా 12 పరుగుల రాబట్టాడు. అయితే వైభవ్ సూర్యవంశీ కేవలం 14 బంతుల్లో 39 పరుగులు రాబట్టాడు. అందులో 5 సిక్సర్లు, 1 ఫోర్ ఉంది. అయితే శార్దూల్ ఠాకూర్ బౌలింగ్‌లో లాంగ్‌ఆన్‌లో తిలక్ వర్మకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అయితే యశస్వి జైస్వాల్.. ఆడిన 32 బంతుల్లో 77 పరుగులు చేసి రాజస్థాన్ రాయల్స్ గెలుపులో కీలక మలుపుగా మారాడు. వీరిద్దరి భాగస్వామ్యం కేవలం 5 ఓవర్లలో 80 పరుగులు రాబట్టారు.

# ముంబయిపై రాజస్థాన్ ఘన విజయం



ఐపీఎల్ 2026లో భాగంగా జరిగిన కీలక మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ అద్భుత ప్రదర్శనతో ముంబయి ఇండియన్స్‌పై 27 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 11 ఓవర్లకు కుదించినప్పటికీ, ఆటలో ఎక్కడా ఉత్కంఠ తగ్గలేదు. ముఖ్యంగా యువ ఓపెనర్లు యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ చేసిన విధ్వంసకర బ్యాటింగ్ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. టాస్ గెలిచిన ముంబయి ఫీల్డింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ మొదటి బంతి నుంచే దాడి మొదలుపెట్టింది. యశస్వి జైస్వాల్ అసలు ఆగేలా కనిపించలేదు. తొలి ఓవర్లోనే అతను బౌలర్లపై విరుచుకుపడుతూ బౌండరీలు, సిక్సర్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. దీపక్ చాహర్ వేసిన మొదటి ఓవర్లోనే 22 పరుగులు రావడం మ్యాచ్ మూడ్‌ను మార్చేసింది. ఇంకొవైపు వైభవ్ సూర్యవంశీ కూడా అదే దూకుడును కొనసాగించాడు. ముఖ్యంగా జస్ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లో అతను కొట్టిన భారీ సిక్సర్లు ప్రేక్షకులను ఆశ్చర్యపరిచాయి. మూడో ఓవర్లో ట్రెంట్ బౌల్ట్‌కూ శిక్ష తప్పలేదు. ఇలా కేవలం మూడు ఓవర్లలోనే రాజస్థాన్ 58 పరుగులు సాధించడం విశేషం. ఈ జోడి తొలి వికెట్‌కు ఐదు ఓవర్లలోనే 80 పరుగులు జోడించడం మ్యాచ్‌లో కీలక మలుపు. అయితే ఆరవ ఓవర్లో సూర్యవంశీ ఔటవడంతో రాజస్థాన్ వేగం కొంత తగ్గింది. అయినప్పటికీ జైస్వాల్ మాత్రం తన దూకుడును తగ్గించలేదు. మరో ఎండ్‌లో పరాగ్ కొద్దిసేపు వేగంగా ఆడగా, జురెల్ త్వరగా ఔటయ్యాడు. చివర్లో హెట్‌మయర్ పెద్దగా ప్రభావం చూపలేకపోయినా జైస్వాల్ అద్భుత ఇన్నింగ్స్‌తో రాజస్థాన్ 11 ఓవర్లలో 150 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్యఛేదనకు దిగిన ముంబయి ఇండియన్స్‌కు ఆరంభం నుంచే షాక్‌లు తగిలాయి. తొలి ఓవర్లోనే రికెల్టన్ ఔటవడంతో ఒత్తిడి పెరిగింది. వెంటనే రోహిత్ శర్మ, నారాయకుంవార్ యాదవ్ కూడా తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరడంతో ముంబయి కష్టాల్లో పడింది. తర్వాతి దశలో కూడా పరిస్థితి మారలేదు. తిలక్ వర్మ, హార్దిక్ పాండ్య వంటి కీలక బ్యాటర్లు కూడా పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ముఖ్యంగా రవి బిష్ణోయ్ ఒకే ఓవర్లో హార్దిక్, తిలక్ వికెట్లు తీయడంతో మ్యాచ్ పూర్తిగా రాజస్థాన్ వైపు మొగ్గింది. మధ్యలో రూథర్‌ఫర్డ్, నమన్ ధీర్ కొంత పోరాటం చూపించినప్పటికీ, అది ఓటమి అంతరాన్ని తగ్గించడానికే పరిమితమైంది. చివరకు ముంబయి 11 ఓవర్లలో 123 పరుగులకే పరిమితమైంది. రాజస్థాన్ బౌలర్లలో నండ్రీ బర్గర్, రవి బిష్ణోయ్, సందీప్ శర్మ రెండేసి వికెట్లు తీసి జట్టుకు విజయాన్ని అందించారు. జోఫ్రా ఆర్చర్, తుషార్ దేశ్‌పాండే ఒక్కో వికెట్ సాధించారు. సమిష్టి బౌలింగ్‌తో ముంబయి బ్యాటింగ్‌ను కట్టడి చేయడంలో వారు విజయవంతమయ్యారు. మొత్తానికి ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ అన్ని విభాగాల్లో ఆధిపత్యం చాటింది. ముఖ్యంగా యువ ఆటగాళ్ల ప్రదర్శన జట్టుకు బలంగా మారింది. మరోవైపు ముంబయి ఇండియన్స్ టాప్ ఆర్డర్ విఫలం కావడం ఓటమికి ప్రధాన కారణమైంది.



# ఐపీఎల్‌ను వెంటాడుతున్న అకాల వర్షాలు..

ఐపీఎల్ 2026 సీజన్‌ను అకాల వర్షాలు వెంటాడుతున్నాయి. గత రెండు రోజులుగా వరుణుడు మ్యాచ్‌లకు ఆటంకం కలిగిస్తున్నాడు. సోమవారం కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా టాస్ పడకుండానే రద్దైంది. ఇక మంగళవారం గౌహతి వేదికగా రాజస్థాన్ రాయల్స్, ముంబై ఇండియన్స్ మ్యాచ్‌కు వరుణుడు ఆటంకం కలిగించాడు. దీంతో మ్యాచ్‌ను 11 ఓవర్లకు కుదించారు. ఈ క్రమంలో ఇప్పుడు అందరి దృష్టి నేడు ఢిల్లీ వేదికగా జరగనున్న ఢిల్లీ క్యాపిటల్స్, గుజరాత్ టైటాన్స్ మ్యాచ్ పైనే పడింది. ఈ మ్యాచ్‌కు వాన దేవుడు ఆటంకం కలిగిస్తాడా..? ఢిల్లీలో ఈ రోజు వాతావరణం ఎలా ఉంటుంది అన్న దానిపైనే ఉంది. అక్యూవెదర్ ప్రకారం ఢిల్లీలో ఉదయం పూట వాతావరణం చాలా స్పష్టంగా ఉంటుంది. అయితే.. మధ్యాహ్నం మేఘావృతమై ఉంటుందని తెలిపింది. మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడే అవకాశం 51 శాతం ఉందని అంచనా వేసింది. ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల మధ్య వర్షం పడే అవకాశం ఉంది. అయితే.. మ్యాచ్ జరిగే సమయం రాత్రి 7 గంటల నుంచి 11 గంటల వరకు ఎలాంటి వర్షం పడదని తెలిపింది. ఆకాశం నిర్మలంగా ఉంటుందని తెలిపింది. అయితే.. మధ్యాహ్నం పడిన వర్షం తరువాత మైదానాన్ని ఎంత త్వరగా సిద్దం చేస్తారనే దానిపైనే పూర్తి మ్యాచ్ జరగనుందా..? ఓవర్లను కుదిస్తారా..? అన్నది ఆధారపడి ఉంది.

# వైభవ్ బ్యాటింగ్‌కు పిచ్చోడినయ్యా..

## - సూర్యవంశీపై పాండ్యా ప్రశంసల జల్లు



రాజస్థాన్ రాయల్స్ సిక్సర పిడుగు వైభవ్ సూర్యవంశీపై ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా ప్రశంసల జల్లు కురిపించాడు. 15 ఏళ్ల వయసులోనే అతను ఆడుతున్న ఫియర్‌లెస్ గేమ్ చూసి పిచ్చోడినయ్యానని తెలిపాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా గౌహతి వేదికగా మంగళవారం జరిగిన మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 27 పరుగుల తేడాతో ముంబై ఇండియన్స్‌ను చిత్తు చేసింది. ఈ మ్యాచ్ అనంతరం మాట్లాడిన హార్దిక్ పాండ్యా.. తమ ఓటమికి చెత్త బౌలింగే కారణమని అంగీకరించాడు. పవర్ ప్లేలో ప్రణాళికలకు తగ్గట్లు బౌలింగ్ చేయాలేకపోయామని తెలిపాడు. వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ ఆశ్చర్యానికి గురి చేసిందని చెప్పిన హార్దిక్.. భవిష్యత్తులో అతను ఇంతకంటే మెరుగ్గా రాణించాలని ఆకాంక్షించాడు. 'మా బౌలింగ్ వైఫల్యమే ఓటమికి కారణం. బ్యాటింగ్ ఏ మాత్రం కాదు. ప్రణాళికలకు తగ్గట్లు బౌలింగ్ చేయలేకపోయాం. రాజస్థాన్ రాయల్స్ అద్భుతంగా బ్యాటింగ్ చేసింది. ఈ ఓటమికి మా బౌలర్లు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉంది. బౌలింగ్ యూనిట్‌గా మేం ఆశించిన స్థాయిలో రాణించలేదు. కానీ రాజస్థాన్ మాత్రం అద్భుతమైన క్రికెట్ ఆడింది. ఈ ఓటమికి బ్యాటింగ్ ఏ మాత్రం కారణం కాదు. ఈ ఓటమికి ఖచ్చితంగా మా బౌలింగ్ విభాగమే బాధ్యత వహించాలి. టీ20 క్రికెట్‌లో రెండు బంతులతో ఫలితం మారిపోతుంది. 27 పరుగుల తేడాతో ఓడిపోయామంటే.. ఐదు బంతులు మంచిగా వేయాల్సింది. అలా వేసి ఉంటే ఐదు సిక్సర్లు వచ్చేవి కావు. మేం సరైన బంతులు వేసి ఉంటే కచ్చితంగా ఈ మ్యాచ్ గెలిచేవాళ్లం. కానీ రాజస్థాన్ ఓపెనర్లు విధ్వంసకర బ్యాటింగ్‌తో మ్యాచ్‌ను లాగేసుకున్నారు. ఆ తర్వాత మేం ఎంత ప్రయత్నించినా విజయం దక్కలేదు. 15 ఏళ్ల వయసులోనే వైభవ్ సూర్యవంశీ నిర్భయంగా ఆడటం చూసి షాకయ్యాను. ఈ మ్యాచ్‌కు సిద్ధమయ్యేటప్పుడు అతని గురించి మేం మాట్లాడుకున్నాం. అతను బ్యాటింగ్ చేసినా విధానం.. ఫియర్‌లెస్ గేమ్, షాట్ సెలెక్షన్ అద్భుతం.. అమోఘం. భవిష్యత్తులో అతను ఇంకా మెరుగ్గా రాణించాలని కోరుకుంటున్నాను. ఈ మ్యాచ్‌లో చేసిన తప్పిదాల నుంచి పాఠాలు నేర్చుకొని తదుపరి మ్యాచ్‌కు సిద్ధమవుతాం. రేపు ఉదయం సూర్యుడు ఉదయించినట్లే మేం కూడా పుంజుకుంటాం. మా తప్పులను సరిదిద్దుకొని ఆర్‌సీబీతో తదుపరి మ్యాచ్‌కు సిద్ధమవుతాం.'అని హార్దిక్ పాండ్యా చెప్పుకొచ్చాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత ఓవర్లలో 3 వికెట్లకు 150 పరుగుల భారీ స్కోర్ చేసింది. యశస్వి జైస్వాల్(32 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లతో 77 నాటౌట్) అజేయ హాఫ్ సెంచరీతో రాణించగా.. వైభవ్ సూర్యవంశీ(14 బంతుల్లో ఫోర్, 5 సిక్స్‌లతో 39) దూకుడుగా ఆడాడు. ముంబై ఇండియన్స్ బౌలర్లలో అల్లా మొహమ్మద్ గజన్‌ఫర్(2/21) రెండు వికెట్లు తీయగా.. శార్దూల్ ఠాకూర్ ఒక వికెట్ పడగొట్టాడు. బుమ్రా, బౌల్ట్, హార్దిక్, దీపక్ చాహర్ తీవ్రంగా నిరాశపర్చారు. బుమ్రా బౌలింగ్‌లో తొలి మూడు బంతుల్లోనే వైభవ్ రెండు సిక్స్‌లు బాదడం విశేషం. అనంతరం ముంబై ఇండియన్స్ 11 ఓవర్లలో 7 వికెట్లకు 120 పరుగులే చేసి ఓటమిపాలైంది. షెర్ఫన్ రూథర్‌ఫోర్డ్(8 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 25), నమన్ ధీర్(12 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 25 నాటౌట్) మినహా అంతా విఫలమయ్యారు.

# సత్తా చాటుతున్న సందీప్ శర్మ

ఐపీఎల్ 2026లో ఉత్కంఠ మ్యాచ్ లు జరుగుతున్నాయి. కొంతమంది బ్యాటర్లు, మరికొంతమంది బౌలర్లు తమ సత్తా చాటుతూ అటు పరుగులు, ఇటు వికెట్లు కొల్లకొడుతున్నారు. ఈ క్రమంలో ఓ ప్లేయర్ మాత్రం తనమైన శైలిలో స్టార్ ప్లేయర్లకు వరుసగా షాక్ లు ఇస్తూ దూసుకెళ్తున్నాడు. ఈ 32 ఏళ్ల ప్లేయర్ వచ్చిన అవకాశాలను సక్రమంగా వినియోగించుకుంటూ కీలక మ్యాచ్ ల్లో వికెట్లు తీస్తూ సత్తా చాటుతున్నాడు. అయితే, ఈ ప్లేయర్ కు భారత జట్టు తరపున ఆడే అవకాశాలు చాలా తక్కువగా వచ్చాయి. కానీ, ఐపీఎల్ లో మాత్రం తన దూకుడు చూపిస్తూ స్టార్ ప్లేయర్లకు చుక్కలు చూపిస్తున్నాడు. ఈ ప్లేయర్ ఎవరో అని ఆలోచిస్తున్నారా.. ఆయన పేరు సందీప్ శర్మ.సందీప్ వర్మ ఇప్పటి వరకు ఐపీఎల్ లో మూడు జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. మొత్తంగా 140 మ్యాచ్ లు ఆడి 149 వికెట్లు పడగొట్టాడు. కాగా, ఈ వికెట్లలో చాలా వరకు స్టార్ ప్లేయర్లవే ఉండడం గమనార్హం. వాళ్ల వికెట్లు తీయడం సందీప్ శర్మకు వెన్నతో పెట్టిన విద్యలా మారింది.సందీప్ శర్మ తీసిన పెద్ద పేర్లలో విరాట్ కోహ్లీ ముందున్నాడు. ఐపీఎల్ లో అత్యధిక పరుగులు చేసిన విరాట్ కోహ్లీ పాలిట విలన్ లా మారాడు. ఆ తర్వాత లిస్ట్ లో రోహిత్ శర్మ, క్రిస్ గేల్, సూర్యకుమార్ యాదవ్ లుఉన్నారు. ఆ తర్వాత లిస్ట్ లో శ్రేయాస్ అయ్యర్, ఇషాన్ కిషన్ వంటి ఆటగాళ్లు ఉన్నారు.విరాట్ కోహ్లీని 7 సార్లు పెవిలియన్ చేర్చిన సందీప్ శర్మ. ఆ తర్వాత రోహిత్ శర్మను 6సార్లు ఔట్ చేశాడు. ఇక క్రిస్ గేల్, సూర్యకుమార్ యాదవ్ లను నాలుగుసార్లు ఔట్ చేశాడు. శ్రేయాస్ అయ్యర్, ఇషాన్ కిషన్ లను తలో మూడు సార్లు ఔట్ చేశాడు. అయితే, ఇక్కడ మరో ఆసక్తికర విషయం ఏంటంటే, సందీప్ శర్మ అత్యధికసార్లు ఔట్ చేసిన ఆటగాళ్లంతా టాప్ ఆర్డర్ లోనే ఉండడం గమనార్హం.



# ధోనీ రాకపై కోట్లాది మంది ఫ్యాన్స్ ఎదురుచూపు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్లో వరుస పరాజయాలతో సతమతమవుతున్న సీఎస్కే అభిమానులకు ధోనీ రాకపై నిరాశే ఎదురవుతోంది. ప్రస్తుత సీజన్లో జట్టు పేలవ ప్రదర్శన కనబరుస్తుండటంకో అందరి దృష్టంతా ఎంఎస్ ధోనీ ఫిట్‌నెస్‌పైనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ ధోనీ లభ్యత గురించి కీలక అప్‌డేట్ ఇచ్చారు. గత 3 మ్యాచ్‌ల్లో వరుసగా ఓడిపోయిన సీఎస్కేకు ధోనీ లేకపోవడం పెద్ద లోటుగా కనిపిస్తోంది. 44 ఏళ్ల ఈ దిగ్గజ ఆటగాడు ఎప్పుడు మైదానంలోకి వస్తాడా అని కోట్లాది మంది ఫ్యాన్స్ ఆశగా ఎదురుచూస్తున్నారు.సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ధోనీ ఇంకా తన గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదు. "ఎంఎస్ ధోనీ కోలుకునే



ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది.. అయితే ధోనీ మైదానంలోకి వచ్చే ఖచ్చితమైన సమయాన్ని ఇప్పుడే చెప్పలేమని.. దీనికి మరికొన్ని రోజులు పట్టవచ్చని సీఎస్కే సీఈవో చెప్పుకొచ్చారు. ప్రీ-సీజన్ క్యాంపులో ధోనీ మోకాలికి గాయమైందని.. అందుకే ఆయన ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదని సమాచారం. సీఎస్కే సీఈవో ప్రకటన ధోనీ రావడానికి మరింత ఆలస్యం కావచ్చని తెలుస్తోంది. ఇది సీఎస్కే అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది.ఎంఎస్ ధోనీ అందుబాటులో లేకపోయినప్పటికీ.. మరో కీలక ఆటగాడు డెవాల్డ్ బ్రెవిస్ రీఎంట్రీపై జట్టు ఆశాభావంతో ఉంది. దక్షిణాఫ్రికాకు చెందిన ఈ యువ బ్యాటర్ గాయం కారణంగా గత కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యాడు.

# పవన్ శిఖరంలా కనిపించారు

## కర్మయోగిని చూశాను: దర్శకుడు బాబీ

సినిమా రంగంలో రారాజుగా వెలిగినా, నేడు ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నా.. పవన్ కల్యాణ్ వ్యక్తిత్వంలో ఎలాంటి మార్పు రాలేదని ప్రముఖ దర్శకుడు బాబీ కితాబునిచ్చారు.
ఎక్స్ వేదికగా బాబీ స్పందిస్తూ... “ఆయన్ని కలవడానికి వెళుతున్నప్పుడు నాలో చిన్న ఉద్వేగం... గతంలో ఆయనతో పనిచేసిన టైములో అప్పుడే రాజకీయాల్లోకి అడుగుపెట్టిన వ్యక్తి. కానీ ఇప్పుడు... ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ చీఫ్ మినిస్టర్. నేను వెళ్ళేసరికి చిరునవ్వులు చిందిస్తున్న ఒక ఋషిలా కనిపించారు... రాజకీయాల్లో తమ ఆస్తుల్ని పెంచుకున్న వ్యక్తుల గురించి విన్నాం, చూశాం... కానీ అన్ని సౌకర్యాలని వదులుకొని నమ్మిన సిద్ధాంతం కోసం బతుకుతున్న ఆయన నాకు ఒక శిఖరంలా కనిపించారు.
అక్కడ ఉన్నంత సేపు ఆయన నాపై చూపించిన ప్రేమకు ఫిదా అయిపోయాను. చివరగా ఒక్క మాట చెబుతున్నాను... జ్ఞానం కోసం రాజభోగాలు వదిలేసి అడవులు పట్టిన బుద్ధుడిని మనం చరిత్రలో చదువుకున్నాం. జనం కోసం తన సుఖాలన్నీ వదులుకొని నిరంతరం శ్రమిస్తున్న కర్మయోగిని ఇవాళ చూశాను“ అని ప్రశంసించారు.





# నా జీవితంలో ఒక బ్రేకప్ ఉంది


## : కృతి శెట్టి

‘ఉప్పెన’ బ్యూటీ కృతి శెట్టి, ‘లవ్ టుడే’ ఫేమ్ ప్రదీప్ రంగనాథన్ జంటగా నటించిన ‘లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ’ (ఎల్.ఐ.కె) సినిమా విడుదలకు సిద్ధమైంది. విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రమోషన్లలో ఈ ఇద్దరు సెలబ్రిటీలు తమ బ్రేకప్స్ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారాయి.
కృతి శెట్టి మాట్లాడుతూ... తనకు గతంలో ఒకసారి బ్రేకప్ జరిగిందని వెల్లడించింది. ఈ విషయం తన తల్లికి కూడా తెలుసని, ప్రస్తుతం మాత్రం తాను సింగిల్‌గా ఉన్నానని స్పష్టం చేసింది. అలాగే సోషల్ మీడియాలో తనపై నెగిటివిటీ ప్రచారం చేసే వారిని ఏమాత్రం ఆలోచించకుండా వెంటనే బ్లాక్ చేస్తానని ఆమె క్లారిటీ ఇచ్చింది.
ప్రదీప్ రంగనాథన్ మాట్లాడుతూ... తన లైఫ్ లో ఒకటి కాదు, చాలా బ్రేకప్స్ జరిగాయని నవ్వుతూ చెప్పాడు. అవతలి వాళ్లే తనను బ్లాక్ చేశారని నిజాయతీగా ఒప్పుకున్నాడు. కాలేజీ రోజుల్లో అమ్మాయిల మెసేజ్‌లకు తాను చాట్ జీపీటీ కంటే వేగంగా రిప్లై ఇచ్చేవాడినని, అంతలా కష్టపడినా చివరకు సింగిల్‌గానే మిగిలిపోయానని సరదాగా వ్యాఖ్యానించాడు.



# ‘రాకా’గా అల్లు అర్జున్..

## ఫస్ట్ లుక్‌తో ఫ్యాన్స్‌కు బర్త్ డే ట్రీట్




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే కానుక లభించింది. ఆయన, ప్రముఖ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రానికి ‘రాకా’ అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మేరకు విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఇప్పటివరకు ఉన్న ఊహాగానాలకు తెరదించుతూ, చిత్ర యూనిట్ అధికారికంగా ఈ ప్రకటన చేసింది. ఈ పోస్టర్‌లో అల్లు అర్జున్ గతంలో ఎన్నడూ కనపడని అనూహ్యమైన రూపంలో దర్శనమిచ్చారు. గుండుతో, ఒంటిపై ప్రత్యేకమైన గుర్తులు, చెవిపోగులతో భిన్నంగా కనిపిస్తున్నారు. ఓ క్రూర మృగం లాంటి చేయి ఆయన ముఖాన్ని కప్పి ఉంచడం సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. ఇది ఒక వింత జంతువు లేదా హైబ్రిడ్ జీవిని పోలి ఉండటంతో కథపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. దాదాపు రూ.800 కోట్ల భారీ బడ్జెట్‌తో పాన్ వరల్డ్ చిత్రంగా దీన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. హాలీవుడ్ స్థాయి సాంకేతిక నిపుణులు విజువల్ ఎఫెక్ట్స్ కోసం పనిచేయనున్నారని సమాచారం. ఈ సినిమాలో అల్లు అర్జున్ సరసన దీపికా పదుకొణే కథానాయికగా నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరితో పాటు రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్, రమ్యకృష్ణ వంటి భారీ తారాగణం కూడా భాగం కానున్నారని వార్తలు వస్తున్నాయి. ఇక ‘రాకా’ అనే పదానికి రాక్షస శక్తి లేదా క్రూరత్వం అనే అర్థాలు ఉండటంతో, బన్నీ నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపిస్తారా? లేక ఇది ఏదైనా సోషియో-ఫాంటసీ కథాంశమా? అని అభిమానులు, నెటిజన్లు అంచనాలు వేస్తున్నారు. దర్శకుడు అట్లీ చివరి నిమిషం వరకు టైటిల్‌ను గోప్యంగా ఉంచి, నేరుగా పుట్టినరోజున ప్రకటించడంతో ఈ ప్రాజెక్ట్‌పై హైప్ మరింత పెరిగింది.

# నేను అంత తక్కువ వాడినా అనిపించింది

## : హీరో శర్వానంద్ ఆవేదన

టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ తన కెరీర్‌లో ఎదురైన అత్యంత కష్టమైన దశ గురించి ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశారు. షూటింగ్ సమయంలో జరిగిన ప్రమాదం, ఆ తర్వాత ఎదుర్కొన్న ఒంటరితనం తనను ఎంతగానో కలిచివేసిందని ఆయన వెల్లడించారు.
‘జాను‘ సినిమా షూటింగ్ సమయంలో థాయ్‌లాండ్‌లో స్కైడైవింగ్ శిక్షణ తీసుకుంటుండగా శర్వానంద్‌కు ఘోర ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆయన భుజం ఎముక విరిగిపోయింది. దీని కోసం అత్యంత క్లిష్టమైన సర్జరీ చేయించుకోవాల్సి వచ్చింది. దీని గురించి శర్వానంద్ మాట్లాడుతూ... సినిమా కోసం ప్రాణాలకు తెగించి సాహసం చేసినా, పరిశ్రమలో గానీ, బయట గానీ ఎవరూ పెద్దగా పట్టించుకోకపోవడం తనను బాధించిందని శర్వానంద్ అన్నారు. “పెద్ద హీరోలకు చిన్న దెబ్బ తగిలినా సోషల్ మీడియాలో రచ్చ జరుగుతుంది. కానీ నేను అంత పెద్ద సర్జరీ చేయించుకున్నా ఎవరూ స్పందించలేదు. నేను ఇండస్ట్రీలో అంత తక్కువ వాడినా అనిపించింది“ అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో ఎదురైన పరిస్థితి తనను మానసికంగా కుంగదీసిందని, తన కష్టానికి తగిన గుర్తింపు లభించలేదనే బాధ ఇప్పటికీ ఉండిపోయిందని పేర్కొన్నారు. శర్వానంద్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆయన పడిన కష్టాన్ని గుర్తించిన నెటిజన్లు, అభిమానులు శర్వానంద్‌కు మద్దతుగా నిలుస్తున్నారు.

# నాని కెరీర్‌లోనే ఫాస్టెస్ట్ హిట్..


# ఆయా షేర్ హిస్టరీ!

నేచురల్ స్టార్ నాని నటిస్తున్న తాజా సినిమా ది ప్యారడైజ్ మరోసారి ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ ఆయా షేర్ రిలీజైన కొద్ది రోజుల్లోనే అద్భుతమైన రికార్డును సొంతం చేసుకుంది. ఈ పాట 100 మిలియన్ వ్యూస్‌ను అత్యంత వేగంగా చేరుకోవడం ద్వారా నాని కెరీర్‌లో కొత్త మైలురాయిగా నిలిచింది. గతంలో నాని సినిమాలకు వచ్చిన సాంగ్స్ కంటే ఈ సాంగ్ అత్యంత వేగంగా ఈ ఫీట్ సాధించడం విశేషం. మాస్ లో పెరిగిన నాని ఇమేజ్ ఈ సాంగ్ లో నాని కనిపించిన రగ్గడ్ అవతార్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. జడల్ అనే పాత్రలో ఆయన చేసిన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఎనర్జిటిక్ డాన్స్ మూమెంట్స్ అభిమానులను మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. సోషల్ మీడియాలో ఈ పాటకు వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే, నాని మాస్ ఇమేజ్ మరింతగా బలపడిందని స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా యూత్ లో ఈ సాంగ్ భారీగా వైరల్ అవుతూ రీల్స్ రూపంలో ట్రెండ్ అవుతోంది. సక్సెస్ ఫార్ములాగా నాని- అనిరుధ్ కాంబో మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ మరోసారి ఈ సాంగ్ తో తన మ్యాజిక్‌ను చూపించారు. గతంలో అతను అందించిన హిట్ సాంగ్స్ సరసన ఆయా షేర్ కూడా నిలిచిపోయేలా ఉంది. ఈ సాంగ్ బీట్, ఎనర్జీ, మరియు మాస్ ఫీలింగ్ ప్రేక్షకులను థియేటర్లలో ఉర్రూతలూగించేలా ఉండబోతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. నాని- అనిరుధ్ కాంబినేషన్ లో ఇప్పటికే పలు హిట్ సాంగ్స్ రాగా, ఇప్పుడు మరోసారి ఈ కాంబినేషన్ సక్సెస్ ఫార్ములాగా మారిందని ఆయా షేర్ సాంగ్ ప్రూవ్ చేసింది




# వాటికి దూరంగా ఉండండి

## : యువతకు రజనీకాంత్ కీలక సూచన



సూపర్‌స్టార్ రజనీకాంత్ యువతను ఉద్దేశించి అత్యంత కీలకమైన, భావోద్వేగపూరితమైన సందేశాన్ని ఇచ్చారు. సినిమాల్లోని సాహసాలను చూసి నిజ జీవితంలో ప్రమాదకర నిర్ణయాలు తీసుకోవద్దని ఆయన హితవు పలికారు. ప్రస్తుత కాలంలో యువత తప్పుడు మార్గాల్లో వెళ్లడంపై రజనీ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా డ్రగ్స్, మద్యం వంటి భయంకరమైన వ్యసనాలకు బానిసలైతే తమ జీవితాలే కాకుండా, వారిని నమ్ముకున్న తల్లిదండ్రుల జీవితాలు కూడా నాశనమవుతాయని హెచ్చరించారు. “క్రమశిక్షణ లేని జీవితం నరకంతో సమానం“ అని ఆయన స్పష్టం చేశారు.
సినిమాల్లో హీరోలు చేసే స్టంట్లు చూసి స్ఫూర్తి పొంది రోడ్లపై బైక్ రేసింగ్‌లు చేయడం ప్రాణాపాయమని, అటువంటి పనులకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థి దశలో చదువుపైనే పూర్తి నిబద్ధతతో ఉండాలని, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని అన్నారు. అలవాట్లు సరిగ్గా లేని స్నేహితులకు దూరంగా ఉండాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి ప్రాథమిక బాధ్యతని గుర్తుచేశారు. తన సినిమాల గురించి మాట్లాడుతూ... అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘జైలర్ 2’ షూటింగ్ పూర్తయిందని, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. అలాగే సిబి చక్రవర్తి దర్శకత్వంలో, కమల్ హాసన్ నిర్మాణంలో రాబోతున్న ‘తలైవర్ 173’ ప్రాజెక్ట్ విశేషాలను కూడా పంచుకున్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613